విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 29 అక్టోబరు 2024 8 పేజీలు

సూపర్‌సిక్స్ అమలు చేయాల్సిందే

నవంబరు 4న కలెక్టర్లకు మెమోరాండం

విశాలాంధ్ర - రావులపాలెం : ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు ఇతర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 4న జిల్లా కలెక్టర్లకు మెమోరాండాలు సమర్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ కోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ వ్యవసాయ కార్మిక సంఘం శ్రేణులను కోరారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కోనసీమ అంబేద్కర్ జిల్లా సమావేశం రావులపాలెంలోని పారా స్వచ్ఛంద సంస్థ ప్రాంగణంలో జిల్లా అధ్యక్షులు శీలం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై

మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ, ఎన్నికల ముందు పేద ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్‌తో పాటు ఇతర హామీలు అమలుపరచకుండా జాప్యం చేస్తున్నాడన్నారు. సంక్షేమ కార్యక్రమాలు అమలులో నిర్లక్ష్యం చేస్తే పేద ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని, హామీల అమలులో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావట్లేదన్నారు. మద్యం గ్రామాల్లో ఏరులై పారుతున్న దని, రక్షిత త్రాగునీరు మాత్రం గ్రామాల్లో పేదలకు దొరకడం లేదన్నారు. ప్రభుత్వం దశల వారిగా మద్యపాన నిషేధం చేస్తామని చెప్పకుండా, మద్యం తక్కువ ధరలకు అందించడం పేద ప్రజల జీవితాలను నాశనం చేయడమే అన్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో పేద ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లో మౌలిక వసతులు సురక్షిత త్రాగునీరు ఇతర సౌకర్యాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. నవంబర్ 4వ తేదీన సూపర్ సిక్స్

▶మిగతా 2లో..

తక్షణమే రోడ్లు నిర్మించండి

కలెక్టర్‌కు సీపీఐ ప.గో. జిల్లా కార్యదర్శి భీమారావు వినతి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో అధ్వాన్న స్థితికి చేరుకున్న రోడ్లు నిర్మాణం తక్షణమే చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు.సోమవారం భీమవరం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ భీమవరం కేంద్రంగా పశ్చిమ గోదావరి జిల్లా ఆవిర్భావం జరిగి సుమారు మూడు సంవత్సరాలు కావస్తున్నా జిల్లా కేంద్రం భీమవరంకు చేరుకునే రోడ్లు నిర్మాణం చేయకపోవడం

▶మిగతా 2లో..

నాణ్యతతో అర్జీల పరిష్కారం

కలెక్టర్ షణ్మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలను అత్యంత నాణ్యతతో త్వరితగతిన పరిష్కరించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం

కలెక్టర్ కార్యాలయంలో వివేకానంద సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, హౌసింగ్ పీడీ ఎన్‌వివి సత్యనారాయణ, సిపిఓ త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ శ్రీనివాసరావు, డీపీఎం, ఎస్‌డీసీ లావణ్యలతో కలిసి హాజరై, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై త్వరితగతిన సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెవిన్యూ, ఫించను,

▶మిగతా 2లో..

అధ్వానంగా గ్రామీణ రహదారులు

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - కొయ్యలగూడెం :గ్రామీణ ప్రాంతాలలో రహదారులను వెంటనే నిర్మించాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మండలంలో తిమ్మనకుంట గ్రామంలో సిపిఐ నాయకులతో శాఖ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణచైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న గ్రామీణ ప్రాంతాలకు రాకపోకలు కొనసాగించాలంటే రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చి నూతన రహదారులను నిర్మించాలన్నారు.గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రజలు నిత్యావసర వస్తువుల కోసం, ఇతర పనుల నిమిత్తం

పట్టణాలకు వెళ్లాలంటే రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయని వెంటనే గ్రామీణ ప్రాంతాల రహదాలను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

రాష్ట్రంలో నూతన రేషన్ కార్డులు జారీ చేసి పది సంవత్సరాలు అవుతుందని అప్పటినుంచి రేషన్ కార్డులు ప్రభుత్వం ఇవ్వలేదని, అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి రేషన్ కార్డులను మంజూరు చేసి, వారికి అంద జేయాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ 6 పథకాలలో హామీలను అమలు చేయాలని, దీనిలో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో ఇల్లు లేని నిరుపేద ప్రజలకు మూడు సెంట్లు భూమి,పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు భూమి ఇల్లు కట్టుకోవడానికి ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కృష్ణ చైతన్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, దుగ్గిరాల నారాయణరావు,ధగాని సుబ్బారావు, చొక్కా బాలస్వామి, రాపోలు భాస్కరరావు, చంద్ర వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

238 అర్జీలు స్వీకరణ

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా

ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 238 దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, డిఆర్ఓ డి. పుష్పమణి, ఆర్డిఓ అచ్యుత అంబరీష్, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, డిప్యూటీ కలెక్టర్లు, భాస్కరరావు, ముక్కంటి లతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

▶మిగతా 2లో..

నాణ్యతతో సమస్యలు పరిష్కరించండి

జేసీ నిషాంతి ఆదేశం

విశాలాంధ్ర - అమలాపురం : ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి వ్యక్తిగత, సామాజిక స్థాయిలలో ఎదురయ్యే సమస్యలకు మరింత నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని జెసి అధ్యక్షతన నిర్వహించి. అర్జీ దారుల నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి, డిఆర్ఓ ఎం వెంకటేశ్వర్లు ఎస్‌ఎస్ఏ ఏపీసీ మధుసూదన రావు, ఐసిడిఎస్ పిడి ఎం ఝాన్సీరాణిలు సుమారుగా 213 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ

పౌరుల ఫిర్యాదులన్నింటినీ కేంద్రీకృత పద్ధతిలో సేకరించి, వాటిని మిషన్ మోడ్‌లో పరిష్కరించ డానికి ప్రభుత్వం చురుకైన చొరవ మీకోసం ద్వారా చూపుతోందన్నారు. జిల్లాస్థాయి అధికారులు తమ లాగిన్‌కు వచ్చిన అర్జీలను రోజు వారీగా పరిశీలన చేస్తూ తమకు సంబంధించిన అర్జీలపై గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, గడువు దాటిన అర్జీలు లేకుండా రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా అధికారుల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ ప్రతిష్టను సమర్థతను పెంచేదిశగా యంత్రాంగం పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రభుత్వ సేవలలో మరింతగా పారదర్శకత పెంపొందేందుకు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి - తహశీల్దార్

విశాలాంధ్ర - వేలేరుపాడు : తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటును అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని స్థానిక తహశీల్దార్ డి వి సత్యనారాయణ అన్నారు.

ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో ఓటు హక్కుకు కావాల్సిన అర్హతలు గురించి సోమవారం ఆయన తెలియజేశారు. ఓటు హక్కు ఏ మండలంలో ఉందో అక్కడే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటుకు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయంలో నవంబర్ ఒకటి 2011 కంటే ముందే డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. దరఖాస్తు ఫారం 18లో వివరాలు పూర్తి చేసి తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో అందించవచ్చని లేదా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు 10వ తరగతి మెమో, డిగ్రీ ఒడి, ప్రొవిజినల్ , ఆధార్ కార్డ్, ఓటర్ గుర్తింపు కార్డుల కాపీలను జతచేసి గెజిట్ అధికారి సంతకం చేయించి అధికారులకు అందించాలన్నారు. నవంబర్ 6తో ఓటు నమోదు చేసుకునే ప్రక్రియ పూర్తవుతుందని అర్హులైన ప్రతి ఒక్కరు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ధాన్యం సేకరణకు సన్నద్ధం

విశాలాంధ్ర- పాలకోడేరు : ఖరీఫ్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి వి. నారాయణరావు తెలిపారు.

దీనికి సంబంధించి అన్ని గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గోనె సంచులను సిద్ధంగా ఉంచినట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రస్తుతం వరి పైరుకు సంబంధించి ఏ విధమైన తెగుళ్లు లేవని, నీటి ఎద్దడి కూడా లేదని తెలిపారు. దిగుబడులు కూడా ఆశాజనకంగా వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. మండలంలో ఈ - పంట నమోదు పూర్తిస్థాయిలో నమోదు చేశామని, రైతు సోదరులు తమ పంటను కోసిన వెంటనే సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి తమకు కావలసిన గోనె సంచులను పొందవచ్చు అన్నారు. రైతు సోదరులు ధాన్యం తూచిన 24 గంటల లోపు ధాన్యం సొమ్ము రైతుల ఖాతాలో జమ చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉన్నట్లు ఆయన తెలిపారు.

బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: బాలల సంరక్షణ కేంద్రాలుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకున్నవారు నిర్దేశించబడిన నమూనాలో తమ దరఖాస్తులను నవంబర్ 11వ తేదీలోపు సంచాలకులు, బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధిబాలల సంక్షేమశాఖ, విజయవాడ కార్యాలయంలో అందచేయాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల సంరక్షణ రక్షణ చట్టం- 2015, సవరణ చట్టం 2021 సెక్షన్ 41, 2016, 2022 నిబంధన 21 ప్రకారం, 'రక్షణ సంరక్షణ అవసరమైన పిల్లల' కొరకు మరియు 'చట్టంతో విభేదించబడిన పిల్లల' కొరకు, పూర్తిగాకానీ, పాక్షికంగాగాని, ప్రభుత్వంచేతగాని, ప్రభుత్వేతరసంస్థల చేతగాని, కేంద్ర ప్రభుత్వం నుండి లేదా రాష్ట్రప్రభుత్వం నుండి నిధులు పొందడంద్వారా కానీ, ప్రభుత్వనిధులు లేకుండాకానీ, నడుపబడుతున్న బాలలసంరక్షణ కేంద్రాలన్నీ, ఇతర ఏదైనా చట్టం క్రింద లైసెన్సు తీసుకున్నప్పటికీ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్పష్టం చేశారు. పూర్తి నోటిఫికే షన్ తదితర వివరాలను డబ్ల్యుడిసిడబ్ల్యు.ఎపి.గవ్.ఇన్ వెబ్ సైటు పొందవచ్చని దరఖాస్తులను స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్ ద్వారా మాత్రమే అందచేయాలని ఆయన వివరించారు. మరిన్ని వివరాలకు 9100045417, 9491063818 నెంబర్లలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

పేకాట స్థావరంపై దాడి : ఆరుగురి అరెస్టు

విశాలాంధ్ర-టి.నరసాపురం : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి నట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం టినరసాపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద రూ. 2,100 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉద్యోగాలకై దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

ఎస్పీ హెచ్చరిక

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ హితవు పలికారు. సోమవారం ఏలూరులోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ ఫిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలు కోసం దళారులు మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలు రావాలంటే ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసి దానికి ప్రామాణిక పరీక్షలను నిర్వహించి ఆయా పరీక్షలలో ఉత్తీర్ణత సాధిస్తేనే ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని గుర్తించాలని చెప్పారు. చేతబడులు అనే మూఢనమ్మకాలను ప్రజలు నమ్మవద్దని, ఆధునిక ప్రపంచంలో ఎంతో ముందుకు వెళుతున్నా ఇంకా పల్లె సీమల్లో చేతబడులు పట్ల అపనమ్మకాలు ఏర్పరచుకుని ఎదుటివారిని హింసిస్తున్నారని, అలా ఎవరన్నా చేస్తే చట్ట ప్రకారం కఠిన

చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన సుమారు 53 ఫిర్యాదులపై సత్వరమే చట్ట ప్రకారం ఫిర్యాదిదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ, అదనపు ఎస్పీ ఫోన్ లో మాట్లాడి అధికారులను ఆదేశించారు. ఏలూరు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదిదారులకు భోజన సదుపాయాలను శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయించి భోజన సదుపాయం కల్పించిన జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు

అర్జీలు స్వీకరణ

(1వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ దివ్యాంగుల అర్జీల స్వీకరణకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారికి ప్రత్యేకమైన కౌంటరును ఏర్పాటు చేసి అర్జీలు సులభమార్గంలో అర్జీలు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిఆర్ఓను ఆదేశించారు.

ఫిర్యాదుదారులు విజ్ఞప్తులను అధికారులు క్షుణంగా పరిశీలించి రీఓపెనింగ్ లేకుండా చూడాల్సిన భాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ సూచించారు.సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సెక్షన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారం

(1వ పేజీ తరువాయి)

బియ్యం కార్డులు మంజూరు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, కెఎస్ఈజెడ్ భూమి ఆన్ లైన్లో నమోదు, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, సదరం సర్టిఫికేట్ మంజూరు, వైద్య ఆరోగ్యం, ఆరోగ్యశ్రీ సేవలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు వంటి అంశాలకు చెందిన 428 అర్జీలు అందాయి.

కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు నిర్మించండి

(1వ పేజీ తరువాయి)

దురదృష్టకరమన్నారు. ఆకివీడు,నాగిడిపాలెం, గణపవరం, పిప్పర,యండగండి, వీరవాసరం, తణుకు తదితర ప్రాంతాల నుంచి భీమవరం చేరుకునే రోడ్లన్నీ తీవ్ర అధ్వాన్న స్థితికి చేరుకుని ప్రమాదాలకు నిలయాలుగా మారాయన్నారు. రోడ్లపై ఏర్పడిన పెద్ద పెద్ద గోతుల్లో వాహనాలు తిరగబడి తీవ్ర ప్రమాదాలకు గురై ప్రయాణి కులు హస్పిటల్స్ పాలై తీవ్ర అంగ వైకల్యాలకు లేదా కొన్ని సందర్భాల్లో మృత్యువాతకు గురవుతున్నా రన్నారు. రోడ్ల దుస్థితి నిరసిస్తూ రోడ్లు నిర్మాణం కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీల్లో భీమవరం ప్రకాశం చౌక్ వద్ద 32 గంటల నిరసన దీక్షలు కూడా నిర్వహించినట్లు భీమా రావు కలెక్టర్ నాగరాణి దృష్టికి తెచ్చారు.ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు గమనంలోకి తీసుకుని తక్షణమే పూర్తి స్థాయిలో రోడ్లు నిర్మాణం చేపట్టాలని భీమారావు కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాంప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, జిల్లా సమితి సభ్యులు కోన గొల్లయ్య, వైవీ ఆనంద్, సుందర్ పాల్గొన్నారు.

అమలు చేయాల్సిందే

(1వ పేజీ తరువాయి)

హామీలతో పాటు ఇతర హామీలు అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు మెమోరాండాలు అందజేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు, సిపిఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు మాట్లా డుతూ కోనసీమ జిల్లాలో వ్యవసాయంపై ఆధారపడిన వ్యవసాయ కార్మికుల కుటుంబాల్లో, కొబ్బరి తోటల్లో దింపుడు, ఒలుచుడు కూలీలు ఎక్కువగా వున్నారని వారి సమస్యలు కోసం పోరాటాలు చేయాలని తెలిపారు. జిల్లాలో భూసమస్యలు కూడా ఉన్నాయని వాటిపై దృష్టి పెట్టి పోరాటాలు చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి కొండే రామకృష్ణ, వరలక్ష్మి,పెద్దిరెడ్డి రాము, రామిరెడ్డి, రవి కుమార్, విజయకుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ సంఘాలు ఏర్పాటు చేసి సభ్యత్వాన్ని సేకరిస్తామని, భూ సమస్యలు, ఉపాధి హామీపై ఆందోళనలు నిర్వహించాలని, సంఘం రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌ను కోనసీమ అంబేద్కర్ జిల్లా రావులపాలెం ప్రాంతంలో డిసెంబర్ రెండో వారంలో నిర్వహించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించినట్టు జిల్లా కార్యదర్శి రామకృష్ణ తెలిపారు.

నేవీ ఆయుధ సామాగ్రి డిపో వద్దు

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : ఏజెన్సీ ప్రాంతంలో నేవీ ఆయుధ సామాగ్రి డిపో వద్దు అని గ్రామసభ ద్వారా తీర్మానించినట్లు వంకవారి గూడెం సర్పంచ్ కుంజా పార్వతి తెలిపారు.

సోమవారం వంకవారి గూడెం పంచాయతీ కార్యాలయం వద్ద నేవీ ఆయుధ కర్మాగార డిపో భూసేకరణ కొరకు గ్రామ సభకు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏపీ ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు హాజరయ్యారు .ఈ కర్మాగారానికి మా పొలాలు ఇవ్వబోమని స్థానిక గిరిజనులు పట్టు పట్టారు .మా ప్రాంతంలో ఆయుధ సామాగ్రి డిపోని ఏర్పాటు చేయవద్దని నినాదాలు తెలిపారు. గిరిజనులు వ్యతిరేకించడంతో ఆయుధ సామాగ్రి డిపో వద్దని తీర్మానించారు. ఎమ్మెల్యే బాలరాజు, బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామసభ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బి. సందీప్ గౌడ్, ఎంపీడీవో కే వెంకటలక్ష్మి, పోలవరం డిఎస్పి వెంకటేశ్వరరావ్ ,జీలుగుమిల్లి సిఐ బి. వెంకటేశ్వరరావు, గిరిజన నాయకులు మడకం వెంకటేశ్వరరావు, తెల్లం దుర్గారావు, మడకం శేషారావు పలు గిరిజన సంఘ నాయకులు, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాలెడ్జ్ అసెస్మెంట్ పరీక్షల్లో చైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర- ఏలూరు : నాలెడ్జ్ అసెస్మెంట్ పరీక్షల్లో స్థానిక విద్యానగర్ ప్రాంతంలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని విజయఢంకా మోగిం చారు.

జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న నాలెడ్జ్ అసెస్మెంట్ ఎగ్జామ్ వివిధ కేటగిరీల్లో అత్యున్నతమైన ర్యాంకులు సాధించి తమకు సాటి ఎవరూ లేరని నిరూపించారు. 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించిన క్యాట్ లెవెల్-1 పరీక్షల్లో ఏలూరు-3, విద్యానగర్ శ్రీ చైతన్య పాఠశాల నుండి మ్యాథ్లో 39 మంది, పాట్ లో- 28 మంది, చాట్ లో- 29 మంది, విద్యార్థులు ర్యాంకులు సాధించి, మొత్తం 96 మంది విద్యార్థులు క్యాట్ లెవెల్ - ఒ పరీక్షలకు ఎంపికయ్యారు. ఇలాంటి మరెన్నో విజయాలను సాధించి భవిష్యత తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని కోరుతూ ప్రధానోపాధ్యాయులు వి.దుర్గారావు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజియం పార్థసారథి, రీజినల్ ఇన్చార్జి ఉదయ భాస్కర్, అకడమిక్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర రావు, డీన్ కెవి.లక్ష్మణ్ కుమార్, ఐపిఎల్ ఇన్చార్జి ఎన్.సత్యనారాయణ, ప్రైమరీ ఇన్చార్జి సిహెచ్.అరుణ, ప్రీ-ప్రైమరీ ఇన్చార్జి టి.ఝాన్సీ, ఉపాధ్యాయులు, తదితరులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రక్తదానం చేసి, మరొకరికి ప్రాణదాతలు కావాలని, లివింగ్ శక్తిప్రైజ్ సంస్థ (ఎల్. ఎస్. ఎం) అధ్యక్షులు ఎం. దేవ సహాయం పేర్కొన్నారు.



లివింగ్ శక్తి ప్రైజ్ సంస్థ సిల్వర్ జూబ్లీ మహోత్సవాల సందర్భంగా మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో ఎల్ .ఎస్ .ఎం సెంటర్ వద్ద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు ఎం. దేవసహాయం మాట్లాడుతూ తమ సంస్థ ప్రారంభించినప్పటి నుండి అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 25వ తేదీ నుండి 29వ తేదీ వరకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ .ఎస్ .ఎం. సంస్థ సభ్యులు , రక్త దాతలు పాల్గొన్నారు.

విఎస్ఎస్ సభ్యులకు చెట్లు పెంచుకునే అవకాశమివ్వాలి

విశాలాంధ్ర-చింతలపూడి: వన సంరక్షణ సమితి సభ్యులకు వ్యక్తిగతంగా చెట్లు పెంచుకునే అవకాశం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం

(బికెఎంయు) జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు ముల్లగిరి లాజరు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ వన సంరక్షణ సమితులు 1996లో ఏర్పాటు చేశారని అప్పటి నుంచి ఇప్పటివరకు అడవి భూముల్లో ఫారెస్ట్ అధికారులు విఎస్ఎస్ సభ్యులు ఉమ్మడి యాజమాన్యం పద్ధతిలో మొక్కలు వేస్తున్నారని ప్రభుత్వం సరైన సమయంలో మొక్కలు ఇవ్వకపోవడం వలన వేసిన మొక్కలపై శ్రద్ధ లేదని కావున వన సంరక్షణ సమితి సభ్యులకు వ్యక్తిగతంగా మొక్కలు పెంచుకునే అవకాశం కల్పించాలని ఆయన కోరారు. జిల్లా వ్యాప్తంగా ఫారెస్ట్ అధికారులు వన సంరక్షణ సమితితో జామాయిల్ వేసారని ఆ జామాయిలు నరకడం లేదని అవి పెద్ద పెద్ద చెట్లయి దేనికి పనికి రాకుండా పోతున్నాయని కొన్ని చెట్లు చనిపోతున్నా యని పేర్కొన్నారు. తక్షణం ఫారెస్ట్ అధికారులు జామాయిల్ నరకడానికి పర్మిషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు బోడ వజ్రం, మండల కార్యదర్శి ఇస్రాకులు వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు ముల్ల గిరి అలెగ్జాండర్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం మిరపనారుతో నష్టాల్లో రైతాంగం

విశాలాంధ్ర - ముసునూరు : నాసిరకం మిరప నారును, విత్తన శుద్ధి లేని విత్తనాలను సరఫరా చేయడం వలన గోరుచుట్టుపై రోకటి పోటు మాదిరిగా గత రెండు దఫాలుగా తీవ్ర నష్టాలను చవి చూసిన మిర్చి రైతులు నేడు మరింత నష్టపోయే పరిస్థితి నెలకొందని జిల్లా రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహ అన్నారు. ముసునూరు మండలంలోని

వలసపల్లి, ఎల్లాపురం గ్రామాల్లో 14 మంది రైతులు సుమారు 21 ఎకరాల్లో నూజివీడు మండలం తుక్కులూరు గ్రామంలోని ఓ ప్రముఖ నర్సరీ నుండి మిరప నారు తీసుకువచ్చి సాగు చేపట్టారు. రైతులు తమ పంటలో ఎదుగుదల లేకపోవడం, అధిక మొత్తంలో మొక్కలు చనిపోవడం నాసిరకం నారు కారణంగానే అని గమనించి, సదరు నర్సరీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లగా ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులను ఆశ్రయించారు. రైతు సంఘం నాయకులు మిర్చి పంటలను పరిశీలించి, బాధిత రైతుల సమస్యను ప్రభుత్వ ఉద్యానవన అధికారులకు వివరించారు.. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు చెంగల వెంకటేశ్వరరావు, పామర్తి శ్రీను, బాధిత రైతులు రాంబాబు, సాల్మన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులనుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు

విశాలాంధ్ర - నూజివీడుటౌన్: రైతుల నుండి విత్తన కంపెనీల పై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబీబ్ భాషా హెచ్చరించారు . మొక్కజొన్న విత్తన కంపెనీలపై రైతులు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో సోమ వారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో ఆయన మొక్క జొన్న విత్తన కంపెనీల ఆర్గనైజర్లతో సమావేశం ఏర్పాటు చేసారు.

ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆర్గనైజర్లకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలన్నారు. విత్తనాలు ఇచ్చేటపుడు అన్నిరకాలుగా ఆలోచించి ఇవ్వాలన్నారు. గ్రామాల్లోని వ్యవసాయశాఖ అధికార్లతో కలసి కమిటీలు వేసి సాగుచేసే రైతులు, విత్తన కంపెనీ, ఎంత దిగుబడి వస్తుంది రేటు ఎంత తదితర వివరాలు లిఖిత పూర్వకంగా ఆర్గనైజర్లు రైతుల ఒప్పందపత్రాలలో పొందుపరచాలన్నారు. విత్తనాలు అందించేట ప్పుడు కచ్చితంగా స్థానిక వ్యవసాయ శాఖ అధికార్లకు తెలియజేయాలన్నారు.

క్లాప్ డ్రైవర్లు సమ్మె విరమణ

విశాలాంధ్ర -భీమవరం: ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ కొటికలపూడి గోవిందరావు చొరవతో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి క్లాప్ డ్రైవర్లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో గత ఇరవై రోజులుగా క్లాప్ డ్రైవర్లు చేపట్టిన సమ్మెను విరమించినట్లు ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వర రావు తెలిపారు. సోమవారం సమ్మె విరమణ వివరాలను చెల్లబోయిన, కిలారి మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌లతో జరిగిన చర్చల్లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జాతీయ నాయకులు సుబ్బారాయుడు, జిల్లా గౌరవాధ్యక్షులు నెక్కంటి సుబ్బారావు, తాము పాల్గొన్నామని చర్చలు ఫలప్రదంగా ముగిసాయని హర్షం వ్యక్తం చేశారు. క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వడానికి,

ఇకపై మున్సిపాలిటీ నేరుగా క్లాప్ డ్రైవర్లకు వేతనాలు ఇవ్వడానికి, వాహనాల మరమ్మతు లను మున్సిపాలిటీ చేయించడానికి మున్సిపల్ కమిషనర్ అంగీకరించారని వివరించారు.

సమ్మె విరమణకు కృషి చేసిన ఎమ్మెల్యే, మాజీ మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ కు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. క్లాప్ డ్రైవర్స్ యూనియన్ ప్రెసిడెంట్ చిలక రాజ్ కుమార్, రేవు వెంకటరమణ, జొన్నాడ శివ, చిలకపటి దైవరాజు తదితరులు పాల్గొన్నారు.

బోగోలు గట్టుమట్టి అక్రమంగా తరలింపు

అధికారుల జోక్యంతో నిలిపివేత

విశాలాంధ్ర-లింగపాలెం: బోగోలు గట్టు మట్టిని రాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా టిప్పర్లు పెట్టి అక్రమంగా తవ్వేసి తరలించేస్తున్నారు. దీనిపై ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. బోగోలు గట్టు ప్రసిద్ది చెందింది. ఈ గట్టులోని కొంత భాగాన్ని ఆక్రమించేసుకొని అనేకమంది నివాసాలు ఉంటున్నారు.అక్రమ నివాసాలు ఉండటంతో కొంతమేర అధికారులు వీటిని తొలగించారు.గట్టు భూమికి సంబంధించి గతంలో నివాస స్థలాలకు పట్టాలు ఇచ్చారు. వీటికి సంబంధించి వివాదాలు తలెత్తడంతో కొన్నేళ్ల క్రితం కొంతమేర ఆక్రమణలు తొలగించారు. నివాసాలను పడగొట్టించారు. ఈ వివాదానికి సంబంధించి గతంలో నివాస స్థలాలు పొందిన వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో వివాదం నెలకొంది. గట్టు ఉన్న భాగాన్ని అక్రమంగా తవ్వేసి తరలించేసు కుంటున్నారు.రెండేళ్ల క్రితం గట్టును అక్రమంగా తవ్వి మట్టిని తరలిస్తుంటే 2022 డిసెంబర్ 6న విశాలాంధ్ర వెలుగులోకి తేవడంతో అప్పటి సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తవ్వకాలను నిలిపి

వేయించారు.గట్టు వద్ద అక్రమ తవ్వకాలు జరగ కుండా బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆ తరువాత ఈ గట్టు జోలికి ఎవరూ రావడం లేదు. మళ్ళీ రెండు రోజులుగా గట్టు మట్టిని తోలేస్తున్నారు. జె.సి.బితో తవ్వుతూ టిప్పర్ల ద్వారా తరలించేస్తున్నారు. దీనిపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తవ్వకాలు నిలుపు చేయాలని, గట్టును కాపాడాలని స్థానిక ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేశారు. అధికారుల జోక్యంతో సోమవారం తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. దీనిపై తహసిల్దార్ నజీమ్ విలేకరులతో మాట్లాడుతూ అక్రమ తవ్వకాలపై తనకు ఫిర్యాదులు అందాయని అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపితే చట్టపరమైన నేరమని తెలిపారు. అక్రమంగా గట్టును తవ్వుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని ఈయన హెచ్చరించారు.

పంట కాలువలో వ్యర్థాలు

- కలుషితమవుతున్న తాగు, సాగునీరు
- నిర్లక్ష్యంగా ఇరిగేషన్ అధికారులు

విశాలాంధ్ర-ఉండి : నియోజకవర్గ కేంద్ర మైన ఉండి మెయిన్ పంట కాలవ చెత్తా,చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, అరటి బొందలతో అధ్వానంగా దర్శనమిస్తున్నది. తాగు, సాగునీరు ప్రవాహానికి తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. చెత్తా,చెదారం ,ప్లాస్టిక్ వర్థాలతో అరటి బొందలతో కాలువలో నీరు ఉండటంతో నీరు కలుషితం అవుతుందని పలువురు వాపోతున్నారు. ఉండి మెయిన్ పంట కాలువ సుమారు 15 గ్రామాలకు కాళ్ల మండలంలోని కొన్ని గ్రామాలకు తాగు, సాగునీరు అందించే ప్రధాన వనరు. వేలాదిమంది ప్రజలు, రైతులు ఈ పంట కాలువ నీరు పైనే ఆధారపడి జీవనం, పశు పోషణ, వ్యవసాయం సాగిస్తూ ఉంటారు. గ్రామాలలోని మంచినీటి చెరువులను సైతం ఈ పంట కాలువ నీరుతోనే నింపుతారు. ఆ నీటిని తాగునీరుగా గ్రామాల్లో వినియోగిస్తూ ఉంటారు. ఇంతటి ప్రాధాన్యత గల ఉండి మెయిన్ పంట కాలువలు చెత్తాచెదారం ప్లాస్టిక్ వ్యర్థాలు అరటి బొందలతో దర్శనమిస్తుంటే ఇరిగేషన్ అధికారులకు చీమకుట్టినట్లుగా లేకపోవడం వారి నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని స్థానికులు వాపోతున్నారు. నీరు కలుషితం కావడంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ఇరిగేషన్ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కౌలు రైతు చట్టం కోసం అభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర - నూజివీడుటౌన్: ప్రభుత్వం ఈ నెల 30 న కౌలు రైతు చట్టం- 2024 ముసాయిదాకు రైతులు, కౌలు రైతుల నుండి అభిప్రాయ సేకరణ తీసుకో నున్నట్లు ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్కె అబీబ్‌భాషా తెలిపారు.సోమవారం స్థానిక వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయంలో ఆయన విలేకరు

లతో మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది రైతుల నుండి 3.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నా మన్నారు. 2 లక్షల ఎకరాల్లో వారిసాగు జరిగిందన్నారు. 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసామన్నారు. రైతులు తమకు ఇష్టం వచ్చిన మిల్లర్లకు ధాన్యం అమ్ముకోవచ్చని, ధాన్యం అమ్మిన 48గంటల్లో రైతులకు సొమ్ము అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 64,686 కౌలు రైతులకు కౌలు కార్డులు అందించినట్లు ఆయన తెలిపారు.

ఏలూరు జిల్లా రెవిన్యూ అధికారిగా విశ్వేశ్వరరావు

విశాలాంధ్ర -ఏలూరు: ఏలూరు జిల్లా రెవిన్యూ అధికారిగా వి. విశ్వేశ్వరరావు సోమవారం బాధ్య తలు స్వీకరిం చారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్విని డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు మర్యాద

పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా రెవిన్యూ అధికారిగా బాధ్యతలు చేపట్టిన వి. విశ్వేశ్వరరావుకు అభినంద నలు తెలియజేశారు. ఒంగోలు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ గా పనిచేసిన వి. విశ్వేశ్వరరావు ఏలూరు జిల్లా రెవిన్యూ అధికారిగా నియమితులయ్యారు.

రిటైర్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: రాష్ట్రప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అసోసియేట్ అధ్యక్షుడు జనాబ్ కరీం జిల్లాల పర్యటనలో భాగంగా

తాడేపల్లి గూడెం యూనిట్ అసోసియేషన్ భవనానికి సోమవారం వచ్చారు. పెన్న నర్స్ సమస్యల పై ప్రసంగించారు. 2018 జూలై1 నుండి చెల్లించవలసిన డీఆర్ బకాయిలు, 11వ పి.ఆర్సి ని బకాయిలు మొత్తంగా కానీ వాయిదాల ప్రకారంగా కాని చెల్లించవలసం దిగా, అడిషనల్ కొంటమ్ పెన్షన్ పునరుద్ధరణ చేయించి 70 సంవత్సరాలవారికి10పర్సంట్, 75 సంవత్సరాలవారికి 15 పర్సంట్ సవరించి ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.కొత్త పీఆర్సీ కమిటీ ఏర్పాటు గడువు ముగియకుండా నియమించాలని ఈలోగా 30పరసెంటు ఇంటిరీయమ్ రిలీఫ్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బిహరికుమార్ జిల్లా గౌరవ అధ్యక్షులు కాయల నాగేశ్వరరావు, గౌరవ సలహాదారు వి.కే.వీరారావు తదితరులు పాల్గొన్నారు.

నారాయణరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- ఉండి : మండల పరిధిలోని వాంద్రం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డిని స్థానిక ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు పరామర్శించారు. నారాయణరెడ్డి తండ్రి ద్వారంపూడి అమ్మిరెడ్డి(87) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. రఘురామ రాజు అమ్మిరెడ్డి చిత్రపటా నికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. నారాయణరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ నారాయణరెడ్డి ధైర్యం తెచ్చుకొని సాంఘిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. నారాయణరెడ్డిని పరామర్శించిన వారిలో గ్రామ పార్టీ అధ్యక్షులు కందుల బలరామకృష్ణ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు కె. నాగ రాజు, పార్టీ సీనియర్ నాయకులు కొత్తపల్లి నాగరాజు టిడిపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయడమంటే పునర్జన్మ కల్పించడమే

ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

విశాలాంధ్ర -భీమవరం టౌన్: రక్తదానం చేయడమంటే మనుషులకు పునర్జన్మ కల్పించడమేనని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో టౌన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఎస్పీ మాట్లాడారు. సమాజ శ్రేయస్సు, రక్షణకు, శాంతియుత వాతావరణానికి ప్రాణాలు అర్పించిన పోలీసు అమర వీరుల త్యాగాలకు గుర్తుగా ఈరోజు చేసిన రక్తదానంతో ప్రాణదానం చేసినట్లేనన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, గర్భిణీలకు ప్రసవం సమయంలో, ఇతర అనారోగ్య పరిస్థితుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులను, రక్తహీనత కారణంగా ఇబ్బందులకు గురవుతున్న ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని, వారికి రక్తాన్ని అందించాలనే లక్ష్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి. భీమారావు, జిల్లా ఆర్మ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, భీమవరం సబ్ డివిజన్ డిఎస్పీ శ్రీ రావూరి గణేష్ జయసూర్య, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీ వి.పుల్లారావు, ఆర్మ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీ కె.వెంకట్రావు, మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై వ్యర్థాలతో తీవ్ర దుర్గంధం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండల కేంద్రమైన కొయ్యల గూడెం పట్టణ శివారు గోపాల పురం రోడ్డులో ఎస్సార్ పెట్రోల్ బంకు సమీ పంలో రోడ్డుపైనే వ్యర్థ పదార్థాలు, చెత్త డంపింగ్ చేయడంతో జాతీయ రహదారిపై రాకపోకలు కొనసాగించే వాహన చోదకులకు, పాదచారులకు, తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. పరింపుడి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కొయ్యలగూడెం పట్టణంలో వ్యాపారాలు కొనసాగించే వివిధ వ్యాపారులు రాత్రి పగలు అని తేడా లేకుండా చెత్తను తీసుకువెళ్లి రోడ్డుపైనే పడవేయడంతో, రహదారిపై వాహన రాకపోకలు కొనసాగించడానికి తీవ్ర అభ్యంతరాలు ఏర్పడుతున్నాయి. చికెన్ దుకాణాల వారు కూడా కోడి వ్యర్థాలను రహదారి వెంబడి పడవేయడంతో తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతుందని పాదచారులు, వాహన చోదకులు పేర్కొంటున్నారు. వ్యర్థాలు తినడానికి వచ్చిన జీవరాసులు వాహనాలకు అడ్డంగా రావడంతో వాహన చోదకులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చెత్త గ్రామంగా ఉన్న కొయ్యలగూడెం పట్టణాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలని, ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్ చొరవతో దివ్యాంగుడికి త్రిచక్ర వాహనం

విశాలాంధ్ర -భీమవరం: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చొరవ, లయన్స్ క్లబ్ సౌజన్యంతో ఒక దివ్యాంగుడి కల నెరవేరింది. తాడేపల్లిగూడెం నివాసి, డిగ్రీ చదువు తున్న కోటిపల్లి సాయిబాబు తాను 90 శాతం పైగా వికలాంగత్వం కలిగి ఉన్నానని రూ. 15 వేలు మంజూరు చేయాలని, అంగవైకల్యంతో ఇంటి నుండి కాలేజీకి వెళ్లి రావడం కష్టంగా ఉందని, దివ్యాంగులు వినియోగించే మోటార్ సైకిల్ ఇప్పించవలసిందిగా జిల్లా కలెక్టర్‌ను అక్టోబర్ 7న కలెక్టరేట్‌లో జరిగిన మీకోసం కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నారు. మౌఖికంగా అభ్యర్థించడం జరిగింది. దీనిపై కలెక్టర్ ఈ విషయాన్ని లయన్ సిహెచ్ కృష్ణంరాజుకు తెలియజేయగా లయన్స్ క్లబ్ నుండి రూ.1.20 లక్షలను సమకూర్చి హొండా యాక్టివా ఆల్టెట్ త్రిచక్ర వాహనాన్ని సోమవారం కలెక్టర్ కార్యాలయంకు తీసుకువచ్చి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సాయిబాబాకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు సాయిబాబా జిల్లా కలెక్టర్ కు, లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

పోడు భూముల పోరాటంలో సీపీఐ ప్రధాన భూమిక

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: పోడు భూముల పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన భూమిక పోషించిందని పోలవరం నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కారం దారయ్య అన్నారు. మండలంలోని కండ్రిగూడెంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఉయికే చంద్రన్న అధ్యక్షతన సీపీఐ శాఖ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దారయ్య మాట్లాడుతూ దేశంలో పేదల పక్షాన నిలిచి పోరాటాలు చేసిన జెండా ఏదైనా ఉందంటే, అది ఒక్క ఎర్రజెండాయేనని తెలిపారు. అనేక సమస్యలపై సుదీర్ఘ పోరాటం చేసిన చరిత్ర సీపీఐకు ఉందని, మత తత్వ పార్టీలు రాజ్యమేలుతున్న ఈ సమయంలో సీపీఐ మరింత పటిష్ఠంగా ఉండాలంటే పార్టీ విధానాల పట్ల ప్రతి కార్యకర్త అవగాహన కలిగి ఉండాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని డిసెంబర్ 26 న ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. చొడెం దుర్గ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేయవలసిన బాధ్యత ఎర్రజెండా మీద ఉందని, దీనికి ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలన్నారు. కార్యక్ర మంలో మండల నాయకులు బేతికిషోర్, తెల్లం మునేశ్వరరావు, గిరిజన సమైక్య సంఘ సభ్యులు నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : భారతదేశ కార్మిక ఉద్యమంలో పెద్దన్న పాత్ర పోషిస్తూ నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతూ అనేక హక్కులు సాధించిన ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పారిశుద్ధ్య విభాగం అధ్యక్షులు కూనపాముల విగ్నేష్ కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 31న వాడవాడలా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తూ పతాకాలను ఆవిష్కరించాలని ఆయన కోరారు. ఏఐటియుసి సమావేశం జంగారెడ్డిగూడెం సీపీఐ కార్యాలయంలో సోమవారం అయి నాల ముత్యాలరావు అధ్యక్షతన జరిగింది.. ఈ సందర్భంగా విఘ్నేష్ మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటియుసి అని ,అనేక కార్మిక హక్కుల సంక్షేమ చట్టాలను సాధించిన ఘనమైన చరిత్ర ఏఐటీయూసీకి ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జంపన వెంకటరమణ రాజు మాట్లాడుతూ అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న చట్టాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కాలరాసి పెట్టుబడుదారులు ,దోపిడీ శక్తుల చేతుల్లో కట్టు బానిసలుగా మారుస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో ద్వారకా తిరుమల మండల సిపిఐ కార్యదర్శి గొలిమే బాలయేసు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ పారిశుద్ధ్య కార్మికుల విభాగం కార్యదర్శి బొక్క శ్రీనివాసరావు, ముప్పిడి శ్రీనివాసరావు, ఇంగుర్తి నాగరాజు, కొత్తూరి ఏమిలేశ్వరరావు, చాపల రమేష్, ఎడ్లపల్లి ప్రసాద్, కలపాల చంటియ్య, పోడుదోలు రమణ, కొత్తూరి శ్రీను, ఇంజనీరింగు విభాగం నుంచి దోసూరి నాగరాజు , అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌ఓకు ఘనంగా వీడ్కోలు

విశాలాంధ్ర -భీమవరం: ఎన్నికలు, వరదలు సమయంలో జిల్లా యంత్రాంగాన్ని సమన్వయంతో నడిపించిన డిఆర్ఓ జె.ఉదయభాస్కరరావు అభినందనీయులని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో నెల్లూరు జిల్లాకు డిఆర్ఓగా బదిలీపై వెళు తున్న డిఆర్ఓ జె.ఉదయభాస్కరరావును కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి శాలువా కప్పి, పూల దండలు వేసి, బుద్ధుని ప్రతిమను బహుకరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా డిఆర్ఓ గా వచ్చి కొద్ది నెలలైనా ఎన్నికల పనులు, జిల్లాలో వరదలు, విజయవాడ వరదలకు సహాయ కార్యక్రమాలు సమన్వయంతో సమర్ధవంతంగా పనిచేశారన్నారు. బదిలీపై వెళ్లిన నెల్లూరు జిల్లాలో కూడా మంచి సేవలు అందించి గుర్తింపు పొందాలని ఈ సందర్భంగా కోరారు. జిల్లా యంత్రాంగం తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మిగతా శాఖలను సమన్వయం చేసుకుంటూ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసినందుకు అభినందించారు. ఎంత కాలం పని చేసాం అనేది కాదని, పని చేసిన కాలంలో మంచి సేవలు అందించడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి హెచ్.నరేష్ చంద్రశేఖర్, డ్వామా పిడి డా. కే సి హెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఆర్డిఏ పి.డి ఎం.ఎస్.ఎస్ వేణుగోపాల్ సూపరింటెండెంట్ రవికుమార్, కోఆర్డినేషన్ సెక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు, జిల్లా కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి రెండుకళ్ళని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడం, క్షేత్ర స్థాయిలో ఆయా సమస్యల పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టడంలో భాగంగా సోమవారం కూడా ఆయన ప్రజా వినతులను స్వీకరించారు. ఆయా సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని వెల్లడించారు. అలాగే ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు బెల్లపుకొండ కిషోర్, అమరావతి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు : సీఐ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలంలో ఎవరైనా మద్యం బెల్ట్ షాప్ లు(దుకాణాలు) నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సిఐ కె ఎస్ వి కళ్యాణ చక్రవర్తి అన్నారు. సోమవారం గణపవరంలో ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీల కంటే ఎక్కువ ధరలు అమ్మినా చర్యలు తీసుకుంటామని, బెల్ట్ షాపులకు ఎక్కడ అనుమతులు లేవని అన్నారు. రెస్టారెంట్లు కిళ్లి షాపుల వద్ద మద్యం అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే 9440902433 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

డిగ్రీ కళాశాలలో జాతీయ ఐక్యత దినోత్సవం

విశాలాంధ్ర - గణపవరం: శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 ల ఆధ్వర్యంలో నేషనల్ యూనిటీ డే సోమ వారం ఘనంగా నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మలకుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు దేశ ఐక్యతను కాపాడాలని, సమగ్రత కోసం కృషి చేయాలని యువత ఐక్యంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.మధురాజు, డాక్టర్ జివి రమణ విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన విధానం వెంటనే రద్దు చేయాలి

విశాలాంధ్ర – కొవ్వూరు : వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా యాజమాన్యం తీసుకువచ్చిన విధానాలను నిలిపివేసి, పాత విధానాలు అమలు చేసి వ్యవస్థను కాపాడాలని రాజమండ్రి డివిజనల్ ఏజెంట్స్ కౌన్సిల్ అధ్యక్షులు మాధవరావు తెలిపారు. ఎల్ఐసి యాజ మాన్యం తీసుకొచ్చిన నూతన విధానాన్ని నిలిపివేయాలని కోరుతూ దేశ వ్యాప్తంగా ఎల్ఐసి ఏజెంట్ల ధర్నా కార్యక్రమం లో భాగంగా సోమవారం మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు . కొవ్వూరు పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం నందు నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమానికి రాజమండ్రి డివిజనల్ ఏజెంట్ కౌన్సిల్ అధ్యక్షులు మాధవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలసీదారులను ఇబ్బంది పెట్టే విధంగా ఎల్ఐసి యాజమాన్యం నూతన విధానం ఉందని వాటిని వెంటనే రద్దు పరచాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్ అసోసియేషన్ కొవ్వూరు బ్రాంచ్ అధ్యక్షులు పి ఎన్ కిషోర్, కార్యదర్శి ఆకన శ్రీనివాసు, ట్రెజరర్ పేపకాయల పోసేష్ కుమార్,ఇమ్మని శ్రీనివాస్ చలమాల శ్రీనివాస్, బి వి ఎస్ ఎన్ ఆచార్యులు భోగరాజు శేష కుమార్...తదితర ఏజెంట్ మిత్రులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును అమలు చేయాలి

విశాలాంధ్ర – కొవ్వూరు : సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ పై ఇచ్చిన తీర్పును ఉమ్మడి రాష్ట్ర ప్రభు త్వాలు అమలు చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. నవంబర్ రెండో తేదీన రాజమండ్రి వేదికగా నిర్వహిస్తున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కొవ్వూరు పట్టణంలోని కెజిఎఫ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు కొవ్వూరు నియోజకవర్గం ఎంఆర్పిఎస్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు గద్దం వినోద్, కొవ్వూరు నియోజకవర్గం కన్వీనర్ ముప్పిడి డానియల్, కొవ్వూరు పట్టణ అధ్యక్షులు కొక్కిరి పార్థీ వెంకటేష్, చాగల్లు మండల అధ్యక్షులు మన్నెల్లి నాని, తాళ్లపూడి మండల అధ్యక్షులు బాబి, ఎం ఈ ఎఫ్ నాయకులు పెనుమాక జయరాజు, అయినపర్తి రాజేంద్ర ప్రసాద్, కండెల్లి భీష్మ గాంగేయుడు , తదితరులు పాల్గొన్నారు

జేగురుపాడు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదుల వెల్లువ

విశాలాంధ్ర – కడియం : రెవెన్యూ శాఖ ద్వారా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారి భూమి వారికి లేకుండా రికార్డులు తారుమారు చేయడం దారుణమని జేగురుపాడు సర్పంచ్ సతీష్ చంద్ర స్టాలిన్ అన్నారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికి కడియం మండలం జేగురుపాడులో సోమవారం సర్పంచ్ స్టాలిన్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ మహాలక్ష్మికి రైతులు పెద్ద ఎత్తున పిర్యాదు చేశారు. అలాగే ఆ గ్రామంలో గల పడాల చెరువును ఫిషర్ మెన్ కో ఆపరేటివ్ సొసైటీ లీజుకు తీసుకుని చేపల పెంపకం చేపడుతుందని, అయితే గత నాలుగు దశాబ్దాలుగా ఆ చెరువును ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నా రని, దీనిపై ప్రశ్నిస్తుంటే ఎదురు తిడుతున్నారంటూ ఆ సొసైటీ అధ్య క్షులు కిరణ్ కుమార్ ఫిర్యాదు చేశారు. దీనిపై సర్వే చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. సర్పంచ్ స్టాలిన్ మాట్లాడుతూ అందరికీ ఈ సమస్య వెంటాడుతుందని, తన కుటుంబ సభ్యులకు కూడా ఈ సర్వే లో భూములు తక్కువగా నమోదుచేశారని, ఇప్పటికైనా అధికారులు ఇలాంటి లోపాలను సరిచేయాలని సూచించారు. ఈ సదస్సులో ఎంపి టీసి నాగిరెడ్డి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, విఆర్ఓ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

విశాలాంధ్ర – సీతానగరం: అధికారులు సమర్థవంతంగా ప్రతిష్ఠాత్మక ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ ఎమ్ భారతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బత్తుల నేరుగా ప్రజల వద్ద నుండి ప్రజా సమస్యల పై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం అందరికీ అందుబాటులో ఉండేలా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తుందని అన్నారు. కావున అధికారుల సూచనలు ప్రకారం ప్రభుత్వ భూమిలో ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు నేరుగా ఇసుకను తీసుకొనివెళ్ళ వచ్చు అని అన్నారు. దీనిలో ఇసుక కావాల్సిన వారు ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయంలో అవసమైన అనుమతులు పొందాలని అన్నారు. అలాగే ఇసుక తీసుకొని వెళ్ళుతున్న ట్రాక్టర్లు పై తప్పనిసరిగా బరకం కప్పి వెనుక వస్తున్న వాహనదారులకు ఇబ్బంది కలగ కుండా చూడాలని అన్నారు. ట్రాక్టర్లు మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలను నడిపితే పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసిల్దార్ ఏ శ్రీనివాస్ ప్రభుత్వ భూమిని గుర్తించి ఇసుక రవాణా సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే పలు సమస్యల పై అర్జీలను స్వీకరించి సమస్యలను పరిష్కారం దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జడ్పిటిసి చలమల వెంకటలక్ష్మి, కూటమి పార్టీ నాయకులు, మండల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

13 బాణసంచా షాపులకు అనుమతి

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలానికి సంబంధించి 13 బాణసంచా షాపులకు అనుమతి ఇచ్చినట్టు దేవరపల్లి తహశీల్దార్ రాజ్యలక్ష్మి అన్నారు దేవరపల్లి తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం మండలంలో షాపు నిర్వాహకులతో అధికారులతో సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ షాపులు గ్రామాల శివార్లలో పెట్టుకోవాలని 18 సంవత్సరాలు లోపు పిల్లలకు షాపు వద్దకు రావడానికి అనుమతి ఇవ్వకూడదని అన్నారు. అనుకోని సంఘటనలు ఎదుర్కోవటానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని షాపు నిర్వాహకులని కోరారు. ఈ సందర్భంగా షాపు నిర్వహణకై పలు సూచనలు చేశారు ఈ సమావేశంలో ఎస్సై వి సుబ్రహ్మణ్యం, ఆర్ ఐ వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా షాపులకు లైసెన్స్ తప్పనిసరి : ఎస్ఐ

విశాలాంధ్ర – చాగల్లు: తూర్పు గోదావరి జిల్లా స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఎస్సై ఆధ్వర్యంలో సోమవారం దీపావళి షాప్ యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేంద్ర మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా యజమానులు కచ్చితంగా లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రజలకు ఇబ్బందికి గురికాకుండా బాధ్యతలను తీసుకోవాలని తెలిపారు. అధికారుల ఉత్తర్వులు ఎవరైనా అత్యుక్రమించిన, అక్రమ బాణసంచా నిల్వలు ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సిబ్బంది సేవలు అభినందనీయం

21 మంది పోలీస్ సిబ్బంది బదిలీ

విశాలాంధ్ర – రాజానగరం : రాజానగరం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వ హించిన సిబ్బంది సేవలు అభినందనీయ మని సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ అన్నారు. రాజానగరం పోలీస్ స్టేషన్ నుంచి 21 మంది పోలీస్ సిబ్బంది బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళుతున్నట్లు సీఐ వీరయ్య గౌడ్ చెప్పారు. ఐదు సంవత్సరాలుగా రాజానగరం స్టేషన్లో విశేష సేవలందించిన సిబ్బం దిని సీఐ వీరయ్య గౌడ్, ఎస్ఐలు పి.మనోహర్, కె.నాగార్జున లు ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఏఎస్ఐ శ్రీనివాస్, రైటర్ శివ , 19 మంది కానిస్టేబుల్స్ ఉన్నట్లు తెలిపారు.

భారీగా మందుగుండు సామగ్రి పట్టివేత

విశాలాంధ్ర – రాజానగరం : ఇంట్లో అక్ర మంగా నిల్వ ఉంచిన దీపా వళి మందుగుండు సామాగ్రి పట్టుకున్నట్లు ఎస్ఐ మనోహర్ అన్నారు. మండల కేంద్రమైన రాజానగరంలోని ఎస్ఐ మనో హర్ సోమవారం తెలిపిన వివరాలు ప్రకారం తమ కు వచ్చిన సమాచారం మేరకు రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంతమూరు గ్రామంలో ఓ ఇంట్లో సోదాలు నిర్వహించగా బాణాసంచా సామగ్రి బద్రపరిచినట్లు గుర్తించామన్నారు. జనవివాసాల మధ్య ఇంట్లో నిల్వ ఉంచిన రూ:రెండు లక్షల విలువైన బాణాసంచా సామాగ్రిని స్వాధీనం చేసుకున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శివ, వీఆర్వో శంకర్ పాల్గొన్నారు.

నిహాన్‌కు 'సత్తి' ఆశీర్వాదం

విశాలాంధ్ర – రంగంపేట : రంగంపేట మండలం చంద్రేడుకు పాక రమణ, విజయ లక్ష్మి దంపతుల కుమారుడు నిహాన్ జయదేవ్ మొదటి జన్మదిన వేడుకకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి హాజర య్యారు. సోమవారం స్నేహం జైదేవ్‌ను మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు, ఆశీస్సులు అందించారు.ఆయనతో పాటు పలువురు వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదాయ వనరులు మలచుకోవాలి

ముగిసిన సుంకర ఫౌండేషన్ ఉచిత మగ్గం శిక్షణ

విశాలాంధ్ర – రాజమండ్రి రూరల్ : తమ సంస్థ ఉచితంగా అందించిన శిక్షణ తరగతులను ఆదాయ వనరులుగా మలచుకోవాలని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వర రావు అన్నారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా అందించనున్న మగ్గం శిక్షణ తరగతులు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శిక్షణకు 60 మంది మహిళలకు ఉచితంగా మగ్గం వర్క్ పై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. నేడు కష్టపడి నేరుకుంటే భవిష్యత్తులో ఆదాయ వనరులుగా ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ నేర్చుకొని తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. శిక్షణ పొందే మహిళలు మగ్గం కిట్లు అందజేశారు.ఈ కార్యక్రమం లో సుంకర ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ సుంకర నాగేశ్వర రావు, ఫౌండేషన్ సభ్యులు మణి, కె.మీనా, కీర్తి, సంధ్యా, లక్ష్మి దేవి,శిక్షకురాలు పాల్గొన్నారు.

అర్జీదారునికి న్యాయం చేయాలి : ఆర్డీఓ

విశాలాంధ్ర – రాజమహేంద్ర వరం రూరల్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి అర్జీదారునికి పూర్తి స్థాయి న్యాయం చేయాలని ఆర్డీఓ కృష్ణనాయక్ డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వ హించిన "పిజిఆర్ఎస్– మీ కోసం" వేదిక లో వచ్చిన అర్జీలను డివిజన్ స్థాయి అధికారులతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్జీని నిర్దీత కాల వ్యవధిలో పరిష్కరించి దరఖాస్తుదానికి న్యాయం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ అధికారులు పాల్గొన్నారు..

ఉద్యోగులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

విశాలాంధ్ర – కొవ్వూరు : విధుల నిర్వహణలో ఉద్యోగులు క్రమశిక్షణతో, నీతి నిజాయితీలతో పనిచేయాలని, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ ఆఫ్ వీక్ కార్యక్రమాన్ని నిర్వహించి అధి, కారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుష్మిత ఇంటిగ్రేటెడ్ ఆఫ్ వీక్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు, అనంతరం వివిధ సమస్యలపై ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయం సిబ్బంది వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లైసెన్సు లేకుండా మందు గుండు సామగ్రి అమ్మితే కఠిన చర్యలు : సీఐ

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : మండలంలో ఈ నెల 31వ తేదిన జరుపుకునే దీపావళికి లైసెన్స్ లేకుండా మందుగుండు సామాగ్రి అమ్మకాలు కొన సాగితే పోలీస్‌లు చర్యలు తీసుకుంటామని మండ పేట సిఐ దొరరాజు హెచ్చరించారు. కపిలేశ్వర పురం మండలం అంగర గ్రామంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ దొరరాజు మీడియాతో మాట్లాడారు. దీపావళి మందుగుండు సామాగ్రి అమ్మకందారులు దుకాణం వద్ద ఇసుక, నీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. దుకాణానికి దుకాణానికి మధ్య మూడు అడుగులు దూరం వుండేలా చూసు కోవాలన్నారు. పిల్లలకు పెద్దలు పక్కన లేకుండా పేలుడు సామాగ్రి అందు బాటులో ఉంచరాదని సిఐ విజ్ఞప్తి చేశారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రేలుడు పదార్థాలు కాల్చేటపుడు అప్రమత్తంగా ఉండాలని సిఐ ప్రజలకు విన్న వించారు. ఈ సమావేశంలో ఎస్ఐ రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌లో ప్రభాస్ ఫ్యాన్స్ అన్నదానం

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్‌లో సోమవారం ప్రభాస్ ఫ్యాన్స్ అన్నదానం చేశారు. సినీ నటులు ప్రభాస్ పుట్టినరోజు పురస్కరించుకుని జగ్గంపేట ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లి బోయిన రాజేష్, ప్రెసిడెంట్ బుక్కా హరికృష్ణ, వైస్ ప్రెసిడెంట్ నాని ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా దాతల సహ కారంతో ఉచిత అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు, ప్రభాస్ ఫ్యాన్స్ తదితరులు పాల్గొన్నారు.

వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వర్కర్స్ పార్ట్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో కొనుకు వెంకటేశ్వర అధ్యక్షతన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇం డియా ఆవిర్భావ దినోత్సవంలో రాష్ట్ర అధ్యక్షులు ముఖ్య అతిథిగా పాల్గొని ఘనంగా నిర్వహించారు. అధ్యక్షులు ఈ సందర్భంగా మాట్లా డుతూ వర్కర్స్ పార్ట్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రథమ సంవత్సరం జరి గిందని, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్లో సభ్యత్వ నమోదు జరుగు తోందని, భారత రాజ్యాంగ ఫలాలు అందాలంటే వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండి యాను బలోపేతం చేయాలని, రాబోయే స్థానిక సంస్థ ఎలక్షన్లో పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. జాతీయ నాయకులు పార్టీ రాయి బండి పాండురంగ పార్టీ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ కన్వీనర్ కుసుమే నరసింహరాజు, అమలాపురం నియోజకవర్గం కన్వీనర్ ముస్కూరి ఏసుబాబు, పి గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ పితాని బేబీ రావు, కముజు సుందరరావు, కుడిపూడి గోపాలకృష్ణ, పాలమూరు రామకృష్ణ, జల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో విద్యార్థుల రక్తదానం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కళాశాలలో పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పెద్దాపురం సబ్ డివి జన్, పోలీస్ శాఖ వారు పెద్ద పురం పట్టణంలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరంలో ఆదిత్య యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని రక్త దానం చేసినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు, తమ అధ్యా పకులు అవసరమయిన ప్రతీసారి రక్తం అందిస్తూ తమ సేవా దృక్పథాన్ని చాటుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల పోలీస్ శాఖ ఉన్నతా ధికారులు, రోటరీ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి బృందం, డీన్ సత్యనారాయణ, కన్వీనర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ ఆక్టివిటీస్ డా బివిహెచ్‌వివిఎస్ వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బివి వీరాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించాలి

పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర - కొత్తపేట : భద్రత, రక్షణ కోసం రోజంతా శ్రమించే పోలీసులకు, సిబ్బందికి ప్రజ లంతా సహకరించాలని కొత్తపేట ఎమ్మెల్యే బం డారు సత్యానందరావు సూచించారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బండారు ప్రారంభించారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ గోవిందరావు, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ సురేంద్ర, బూసి జయలక్ష్మి భాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, ధరణాల రామకృష్ణ, కంఠంశెట్టి చంటి, మిద్దే ఆదినారాయణ, చొడపనీడి భాస్కరరావు, రెడ్డి తాతాజీ, బీరా ఇసాక్, దొనబోయిన ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - కొత్తపేట : ప్రస్తుత పోటీ విద్యా విధానంలో విద్యార్థులు వ్యక్తిగత నైపు ణ్యాలను పెంపొందించుకోవాలని రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామ యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ అమర్ కొత్తపేట సిద్ధార్థ శతాబ్ది కళాశాల ప్రిన్సిపాల్ కట్టా నాగ మోహన్ అన్నారు. విజిలెన్స్ అవేర్నెస్ 2024లో భాగంగా దేవరపల్లి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ విద్యార్థులకు అవగాహన కార్య క్రమంలో భాగంగా వ్యాసరచన, వక్తృత్వ, జనరల్ ప్రొఫిషియన్సీ తదితర పోటీలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా బ్యాంక్ బిఎం అమర్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లితండ్రుల ఆశయా లను దృష్టిలో ఉంచుకుని పట్టుదలతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని సూచిం చారు. డిగ్రీ కళాశాల నుండి వ్యాసరచన పోటీల్లో కె మేరీ సుసన్న ప్రథమ బహుమతి, వి భాను స్రవంతి ద్వితీయ బహుమతి, కె హేమ మణి పల్లవి తృతీయ బహుమతి సాధించారు. అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో ఎం హేమశ్రీ ప్రథమ బహుమతి, ఎం శుభశ్రీ ద్వితీయ బహుమతి, ఆర్ వేణు పల్లవి తృతీయ బహుమతి సాధించారు. అలాగే జనరల్ ప్రొఫిషియన్సీలో వై అనూజ ప్రథమ బహుమతి, ఎస్ సార్విజ ద్వితీయ బహుమతి, బి యాస్మిన్ తృతీయ బహుమతి పొందారు. గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపాల్ నాగమోహన్, బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ అమర్ సిద్ధార్థ, ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ రెడ్డి సత్యనారాయణ, బ్యాంకు సబ్ మేనేజర్ బి ఉదయ్ కుమార్ బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమములో విశ్రాంత ఎంఈఓ అజ్జరపు శ్రీరాములు, సీనియర్ అధ్యాపకులు ఎన్ జయరాజ్, జి శ్రీను, డాక్టర్ వివిఎస్ సుబ్బారావు, ఆఫీస్ ఇన్చార్జి ఎ సాయి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రరూపం దాల్చిన ఏజెంట్ల మహాధర్నా

- తాము సైతం అంటున్న మహిళ ఏజెంట్లు
- సంఘీభావం తెలిపిన ఉద్యోగ సంఘాలు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం గ్రామీణం : భారత భీమా సంస్థ(ఎల్ఐసి) ఏజెంట్లు జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చిన నూతన షరతులకు నిరసిస్తూ లియాఫీ యూనియన్ నాయకులు, ఏజెంట్లు సోమ వారం తలపెట్టిన మహాధర్నా ఉగ్రరూపం దాల్చింది. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం రూరల్ బ్రాంచ్ లియాఫీ యూనియన్ అధ్యక్షులు అదిమూలం సాయిబాబా ఆధ్వర్యంలో 16 రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన విషయం పాఠకులకు విదితమే. ధర్నాకి ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు, లియాఫి యూనియన్ డివిజన్ సభ్యులు రావుల మాధవరావు లు విచ్చేసి తమ సంఘీభావాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా లియాఫీ రాజమండ్రి డివిజన్ యూనియన్ సభ్యులు రావుల మాధవరావు మాట్లాడుతూ తమ యూనియన్ దేశ వ్యాప్తంగా ఇచ్చిన పిలుపుమేరకు గత 16 రోజులుగా దేశంలోని అన్ని ఎల్ఐసి సంస్థలు ఎదుట నిరసన దీక్షలు చేస్తున్నారని చెప్పారు. ఎల్ఐసి మేనేజ్మెంట్ తమ యూనియన్ పెద్దలతో చర్చలకు దిగి వచ్చేరారని, ఇవి సఫలీకృతం కావాలని ఆశిస్తున్నట్లు చెప్పారు.రూరల్ బ్రాంచ్ యూనియన్ అధ్యక్షులు అదిమూలం సాయిబాబా మాట్లాడుతూ ఉద్యమాలకు పురిటిగడ్డ రాజమహేంద్రవరం అని, అటువంటి గడ్డపై తాము తమ నిరసన జ్వాలలు ఉవ్వెత్తున ఎగిసేలా దీక్షలు చేపట్టామ న్నారు. 1956 నుండి ఏజెంట్ల కు ఇస్తున్న కమీషన్లను పెంచకపోగా తగ్గించడం ఏంటని ప్రశ్నిం చారు. 12ఏళ్లుగా ప్రతి ఏజెంట్ తలెత్తుకొనే విధంగా వివిధ చర్యలు చేపట్టామని గుర్తు చేశా రు. ఖాతాదారులకు పెనుభారంగా మారిన జీఎస్టి రద్దు చేయాలని మండిపడ్డారు. గ్రామీణ ప్రాం తంలో నిరు పేదలను దృష్టిలో ఉంచుకుని పెంచిన ప్రీమియం, పాలసీలు లను ఉపసం హరిం చుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించుకుంటే దేనికైనా సిద్ధమేనని హెచ్చరిం చారు.అనంతరం ఎల్ఐసి మేనేజ్మెంట్ కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో లియా యూనియన్ నాయకులు జికె చంద్రశేఖర్, ఈ.రవి కుమార్, వై.రామ్మో హన్, మట్ట సత్య నారాయణ,ఏజెంట్లు అక్కిరెడ్డి సూరిబాబు, కె.ఎన్.రామకృష్ణ, అమీరిశెట్టి ఏసు,ఎ.కృష్ణగండేపల్లి వెంకటరావు, గంగరావు, ఎన్.ఎస్.సూర్య ప్రకాష్, త్రిష, ఎ.గౌరీ,కె. రమేష్, జోషఫ్, దేవానంద్, పి వివి సత్యనారాయణ, మల్లిఖార్జునరావు, పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలి

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం పవన్ కుమార్

విశాలాంధ్ర - గండేపల్లి : అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పవర్ గ్రిడ్, సూరంపాలెం డీజీఎం పవన్ కుమార్ అన్నారు. అవినీతి అవగాహన వారోత్సవాలు ప్రారంభోత్సవం సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ అవగాహన వారోత్స వాలు–2024లో భాగంగా ఉద్యోగస్తులకు, కళాశాల, హై స్కూల్ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులకు అవగాహనా సదస్సులు నిర్వహించి జాగృతం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పవన్‌కుమార్, మేనేజర్ జె కోటేశ్వరరావు, జెఇ ఎఎస్ఎన్ మూర్తి, ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10న రెడ్డి కార్తీక వన సమారాధన

రానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర - అనపర్తి, పెద పూడి : కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం, రెడ్డి హెల్త్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో నవంబర్ 10న ఉదయం 9 గంటల నుండి రెడ్డి కుటుంబ సభ్యులకు వనసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్య క్షులు కర్రి త్రినాధ్ రెడ్డి, యువజన సంఘం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్తి వీర్రెడ్డి, కోశాధికారి మల్లిడి సూరారెడ్డి తెలిపారు. సోమవారం త్రినాధ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విశిష్ట అతిథులుగా రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం రాంప్రసాద్ రెడ్డి, ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలు బివి జయ నాగేశ్వర్ రెడ్డి, బుద్దా రాజశేఖర్ రెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, భూమా అఖిల ప్రియా రెడ్డి, జూల కంటి బ్రహ్మానందరెడ్డి, జెసి అస్మిత్ రెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, సెంట్రల్ కాటన్ బోర్డ్ మాజీ డైరెక్టర్ చింతకుంట శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిర్ల జగ్గి రెడ్డి, నల్లమిల్లి శేషారెడ్డి, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి హాజరౌతారని చెప్పారు. అదేవిధంగా ఉదయం తొమ్మిది గంటల నుండి శ్రీపురం లే అవుట్ దగ్గర, దుప్పలపూడి సబ్ స్టేషన్ వెనుక గల నేషనల్ వెంకట రెడ్డి మామిడితోటలో వన సమారాధనా కార్యక్రమం జరుగుతుందని, సాంస్కృతిక కార్యక్ర మాలు కూడా నిర్వహించడంతో పాటు బంపర్ డ్రాలో గెలిచిన విజేతలకు విలువైన బహుమతులు అందించడం జరుగుతుం దని వన సమారాధన ఆహ్వాన కమిటీ తెలిపింది. ఈ కార్యక్ర మం రెడ్డి సోదరులంతా విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్‌లో సర్‌సివి రామన్ విద్యార్థి సత్తా

విశాలాంధ్ర - అమలాపురం : రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో సర్‌సివి రామన్ విద్యార్థి బలసాడి నెహల్ సత్య నబిత్ అత్య ద్భుతమైన ప్రతిభను కన బరిచి రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బాలుడు ప్రతిభా పాటవాలను ప్రశంసించారు. సర్‌సివి రామన్ పాఠశాల డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ ఎన్ శ్రీనివాస్, విద్యార్థి నెహల్ అభినందించారు.

మెరుగైన వైద్యం అందించడమే చంద్రబాబు లక్ష్యం

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్ర రాష్ట్రాన్ని ఆరోగ్య రాష్ట్రంగా తీర్చిదిద్ది రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన రూ.48 లక్షల చెక్‌లను 18 కుటుంబాలకు శాసన సభ్యులు వనమాడి కొండబాబు అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని ఆరోగ్య రాష్ట్రంగా తీర్చిదిద్ది, పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల సునీత, మేడిశెట్టి ఈశ్వరరావు (చిన్ని), పసగడుగులు శేషగిరిరావు, పొంగా బుజ్జి, నీలకాయల సన్నీ, రిక్కా లక్ష్మి, అమలకంటి బలరాం, రెడ్నం సత్తిబాబు, తెప్పల రామలింగేశ్వరరావు, సతీష్, తాడిచర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవుల త్యాగాలు వెలకట్టలేనివి : డీఎస్పీ

విశాలాంధ్ర - పెద్దాపురం : సమాజంలో అమర జీవుల త్యాగాలు ఎనలేనివని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు అన్నారు. అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక రోటరీ క్లబ్ బ్లడ్ బ్యాంక్ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం ఎస్ఐ మౌనిక అధ్యక్షతన జరిగిన వారోత్సవాల సభలో డిఎస్పీ శ్రీహరి రాజు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ పాత్ర కీలకమైనదని, సమాజం కోసం అమరజీవుల త్యాగాలు వెలకట లేనిదన్నారు. పోలీస్ సిబ్బంది , సుమారు 150 మంది రక్తదాతలు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన సిబ్బందిని డిఎస్పీ శ్రీహరి రాజు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట సీఐలు క్రాంతికుమార్, కృష్ణ భగ వాన్, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, సచి వాయాల మహిళా పోలీసులు, ఆటో యూనియన్ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికలో ఫిర్యాదుల స్వీకరణ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి 52మంది ఫిర్యాదు దారులు హాజరై తమ సమస్యలను జిల్లా ఎస్పీకి స్వయంగా తెలియచేసుకున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించ వలసిందిగా ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. సకాలంలో సత్వర న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పరిపాలన వీజీ భాస్కర రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్స్ ఓట్లు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : డిగ్రీ పూర్తయ్యి మూడు సంవత్సరాలు అయ్యిన వారు, గతంలో గ్రాడ్యూట్ ఓట్లు వేసిన వారు ఇప్పుడు ఓట్లు నమోదు చేసుకోవాలని తెలుగు దేశం పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ సూచించారు. కిర్లంపూడి మండలం రాజుపాలెం, ముక్కొల్లు గ్రామల్లో కూటమి నాయకులతో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు, ఎమ్మెల్సీ ఓట్లు నమోదు, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న పెళ్ళికానుక గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోట రవి, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపతే చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర - గండేపల్లి : మద్యం సేవించి వాహనాలు నడిపడం చట్ట రీత్యా నేరమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జగ్గంపేట సిఐ వైఆర్‌కె శ్రీనివాస్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జగ్గంపేట సిఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సై శివ నాగబాబు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ వాహన తనిఖీల్లో పట్టుబడ్డ వారిపై కేసులు నమోదు చేశారు. వీరిని పెద్దాపురం కోర్టులో ప్రవేశపెట్టగా, ఆరుగురు వ్యక్తులకు పది వేల రూపాయలు, ఇద్దరికి రెండు రోజులు జైలు శిక్ష, పబ్లిక్ ప్లేసులలో మద్యం సేవించిన 10 మందికి 500 రూపాయలు చొప్పున జరిమానా విధించారు.

జెఎన్‌టియుకెలో సాంకేతికత,నాయకత్వంపై వర్క్‌షాప్

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో సోమవారం విసి కాన్ఫరెన్స్ హాలు నందు గ్లోబల్ ఎంగేజ్‌మెంట్, టెక్నాలజీ ఇంటగ్రేషన్ ద్వారా అకడమిక్ ఎక్సలెన్స్‌ను అభివృద్ధి చేసేందుకు జెఎన్‌టియుకె, మలేషియా దేశం మెలాకాలోని యూనివర్శిటీ టెక్నికల్ మలేషియాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సాంకేతికత, నాయకత్వంపై కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న టీచింగ,నాన్ టీచింగ్ సిబ్బందితో ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ సమీక్ష నిర్వహించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ పర్యటన ద్వారా రాబోయే సాంకేతిక నైపుణ్యాలు, నాయకత్వ సాధనాలతో అధ్యాపకుల అకడమిక్ ఎక్సలెన్స్‌ను అభివృద్ధి చేయవచ్చున్నారు. యూనివర్శిటీ టెక్నికల్ మలేషియాలోని ఉత్తమ పద్ధతులను జెఎన్‌టియుకె యూనివర్శిటీతోపాటు ఉన్నత విద్యా సంస్థలలో ప్రవేశపెట్టడం ద్వారా యూనివర్శిటీని, రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రస్తుత సాంకేతిక రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) కీలక పాత్ర పోషిస్తుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) యూనివర్శిటీను ప్రారంభించేందుకు తగిన చర్యలు చేపట్టామన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు మొదటి దశలో టీచింగ్ , నాన్‌టీచింగ్ సిబ్బంది, పరిశ్రమలకు చెందిన నిపుణులను కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్‌నకు పంపించామని, రెండవ దశలో ఐటి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సిబ్బందిని పంపించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ రవీంద్రనాధ్, చీఫ్ ఇంజనీర్ ప్రొ వి శ్రీనివాసులు, యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్స్ ప్రొ ఎం స్వరూపారాణి, ప్రొ జివిఎస్ఆర్ దీక్షితులు, యూనివర్శిటీ లైబ్రేరియన్ దొరస్వామినాయక్, యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డా జి శ్యామ్ కుమార్, జాయింట్ రిజిస్ట్రార్ జోగారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ హెచ్ఆర్ నాగేశ్వరరావు, టైపిస్ట్ ఆర్ సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఎఫ్‌యుఆర్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొ స్వర్ణకుమారి, ఎస్ఎంఎస్ డైరెక్టర్ ప్రొ కృష్ణమోహన్, ఎస్సీ, ఎస్టీ సెల్ లైజనింగ్ ఆఫీసర్ కుమారస్వామి, యుసిఇఎన్ ప్రిన్సిపాల్ ప్రొ సిహెచ్ శ్రీనివాసరావు, యుసిఇఎన్ వైస్ ప్రిన్సిపాల్ డా వైఎస్ కిషోర్‌బాబు అన్‌లైన్‌లో హాజరయ్యారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : రైతన్నలు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పిలుపునిచ్చారు. మండలంలోని సిరిపురం గ్రామంలో ఉత్తమ రైతులను ఆయన సోమవారం సన్మానించారు. పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయ అధికారుల తెలిపే సూచనలు, సలహాలు పాటించి మంచి దిగుబడి సాధించిన రైతులు గోగుల లక్ష్మీనారాయణ, సంఘున ప్రభుజి, చిలకమర్తి ఆదినారాయణ, అడ్డాల త్రిమూర్తులు, రంది లక్ష్మయ్య, అల్లం బ్రహ్మంలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి జ్యోతి, జిల్లా వనరుల కేంద్రం డిడిఏ బి హరి, ఏడిఏవై వి గంగాధర్, ఎష్టిసిఏ ఈడి సంజీవ్ కుమార్, వైస్ ఎంపీపీ సాదె లోవరాజు, సర్పంచ్ పీతల నూకరాజు, రైతులు దనేకుల వీరభద్రరావు, బచ్చల శివ, సాగి వెంకటరమణ వ్యవసాయ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

హోమియోపతి ఆసుపత్రిని పునరుద్దరించాలి

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని జొన్నాడ గ్రామంలో హెూమియోపతి ఆసుపత్రిని పునరుద్దరించాలని మండల పరిషత్ లో సోమవారం జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు అర్జీ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో హెూమియోపతి సేవలు 18 నెలల నుండి నిలిపివేశారని, స్థానిక ప్రజలతో పాటు చుట్టుపక్కల, సుదూర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ సేవలను ఉపయోగించుకునేవారని, ప్రస్తుతం ఈ ఆసుపత్రిని నిలిపివేయడంతో అనేకమంది రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనిపై ఎమ్మెల్యే బండారు సానుకూలంగా స్పందించారు. నేతలు తాడి శ్రీనివాస్ రెడ్డి(బట్టి శ్రీను), గొడవర్తి దుర్గాప్రసాద్, అయినవిల్లి సత్తిబాబు, శ్రీనివాస్, గోపి పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల ధర్నా

విశాలాంధ్ర - ఏలేశ్వరం : స్థానిక ఎల్ఐసి శాటిలైట్ బ్రాంచ్ కార్యాలయం వద్ద ఎల్ఐసి ఏజెంట్లు ధర్నా చే పట్టారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్లు సంఘం అధ్యక్షుడు కోరుకొండ నూకరాజు మాట్లాడుతూ 16 రోజులుగా అనేక విధాల నిరసన తెలుపుతున్న అధి కారులు పట్టించుకోలేదన్నారు. ఎల్ఐసికి మూల స్తంభాలుగా ఉన్న కస్టమర్ల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొళ్ళ నాగేశ్వరరావు, సంఘం ఉపాధ్యక్షుడు టి పరదేశి రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి లక్ష్మణరావు, వెల్లంపల్లి సుబ్బారావు, పాంగ్రంకి నూకరాజు, మాగంటి సూరిబాబు, రౌతు సహదేవుడు, గుసిడి నాగార్జున, గొర్రెల అర్జున్ నాయుడు, సూర్య ప్రకాష్, ఏజెంట్లు ఉన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

పరిష్కార వేదికలో కమిషనర్ భావన

విశాలాంధ్ర - కాకినాడ : డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీ లకు సత్వర పరిష్కారం చూపాలని కాకి నాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ నగరపాలక అధికారులను ఆదేశించారు. సోమవారం కాకి నాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని కమిషనర్ భావన నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 18 మంది ఫోన్ చేసి తమ సమస్యలను అధికారులకు వివరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కమిషనర్ భావన ఐఏఎస్ నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిం చారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాల న్నారు. పరిష్కరించిన అర్జీల వివరాలు ఆన్లైన్లో పొందుపరచాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎంహెచ్ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ శిరీష్, ఏసీపీ నాగశాస్త్రులు, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి వెంకట్రాజు, ఏడీహెచ్ సిరిల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఏలేశ్వరం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేసి అనారోగ్యంతో పదవీ విరమణ పొందిన లింగంపర్తి గ్రామానికి చెందిన డ్రైవర్ ఎల్వివి సత్యనారాయణ ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు. ఈ మేరకు ఏలేశ్వరం ఎస్సై ఎన్ రామలింగేశ్వర రావు వివరాలుతెలుపుతూ నాలుగు సంవత్సరాల క్రితం పదవీ విరమణ పొందిన సంస్థ నుండి రావలసిన డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల పాలై జీవితంపై విరక్తి చెందిన సత్యనారాయణ ఆదివారం గడ్డి మందు తాగాడు.

కుటుంబ సభ్యులు ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు ప్రాథ మిక చికిత్స అందించి కాకినాడ ఆస్పత్రికి తరలించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ సత్యనారాయణ మృతి చెం దాడని ఆయన తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒరిజనల్ దస్తావేజులు పోయినవి

మద్దుల వెంకట రామకృష్ణ, S/o. శ్రీహరికృష్ణ అను నేను కొవ్వూరు పట్టణంలోని రాజీవ్ కాలని వాస్తవ్యరాలునైన నాకు కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నెం: **6759/2022** నెంబరుతో ది. **07-10-2022**వ తేదీన రిజిస్టర్ కాబడిన నా యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ ది. **20-10-2024**వ తేదీన జిరాక్స్ నిమిత్తం కొవ్వూరు మెయిన్ రోడ్డు లో గల షాపు వద్ద జీరాక్స్ తీసుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గ మధ్యలో పోయినవి. కావున పై ఒరిజినల్ దస్తావేజులు దొరికిన యెడల ఈ క్రింది తెలిపిన అడ్రస్సుకు లేదా ఫోన్ నెంబరుకు తెలియజేయగలరని విజ్ఞప్తి చేస్తున్నాను.

మద్దుల వెంకట రామకృష్ణ
డోర్ నెం: 14-18-26,
1వ వార్డు, రాజీవ్ కాలని, కొవ్వూరు
సెల్:9059665583.

ఫిర్యాదుదారుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలి

ఎస్పీ నరసింహా కిషోర్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం" (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి, వారి కష్టాలను, బాధలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాదిదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... అర్జీలకు నాణ్యతతోపాటు నిర్దేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు అందించిన వినతులను పరిశీలించి నాణ్యతతో చట్ట పరిధిలో వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నేటి పోలీసు "పిజిఆర్ఎస్" కార్యక్రమానికి 28 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు, దొంగతనం కేసులు, ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) లోక్ అల్లూరి వెంకట సుబ్బరాజు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారిగా తామరాల సీతారామమూర్తి

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం రూరల్ : తామరాల సీతారామమూర్తి 1995 సంవత్సరం లో ప్రొబిషనరీ డిప్యూటీ తహశీల్దారుగా శ్రీకాకుళం జిల్లా కవిటి మండలంలో మొదటి సారిగా ప్రభుత్వ సర్వీస్‌లో చేరారు.అనంతరం వివిధ హోదాల్లో పని చేస్తూ డిప్యూటీ కలెక్టర్‌గా శ్రీకాకుళం జిల్లా వంశధార ప్రాజెక్టు ల్యాండ్ ఎక్విజేషన్ అధికారిగాను, ఏపీ సిఆర్డిఏ ల్యాండ్ పూలింగ్ విభాగంలోను, మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ (ముడ), ల్యాండ్ ఎక్విజేషన్ బందర్ పోర్ట్స్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా (కె ఆర్ ఆర్ సి)శ్రీకాకుళం జిల్లా ల్యాండ్ సర్వే ప్రాజెక్టులో, అనంతరం పలాస ఆర్డిఓగా, తదుపరి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విశాఖపట్నం ల్యాండ్ ప్రొటెక్షన్ భాగంలోను పనిచేసి నేడు బదిలీపై తూర్పు గోదావరి రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓగా తామరాల సీతారామమూర్తి బాధ్యతలను స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు తమరాల సీతారామ్మూర్తి జాయింట్ కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు సిబ్బంది కలెక్టరేట్ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఇప్పటివరకు తూర్పు గోదావరి జిల్లా డిఆర్ఓగా పనిచేసిన జి నరసింహులు బదిలీపై తిరుపతి జిల్లాకు వెళ్లారు

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

విశాలాంధ్ర - అమలాపురం : ఎల్ఐసి పాలసీలో అనేక రకాల మార్పుల వలన జీవిత బీమా సంస్థ పాలసీ దారులకు, ఏజెంట్లకు ఇబ్బందికర సమస్యలు ఉత్పన్నమయ్యాయని వెంటనే పాలసీ దారులకు ఇబ్బందికరమైన మార్పులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎల్ఐసి యూనియన్ ప్రెసిడెంట్ ఎస్ సర్వేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం అమలాపురం ఎల్ఐసి కార్యాలయం వద్ద కోనసీమ జిల్లాలో ఉన్న ఏజెంట్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మంచి పేరున్న జీవిత బీమా సంస్థ యొక్క పాలసీలకు ఏజెంట్లుగా కొత్త విధానం వలన ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు నెలకొన్నా యన్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో లక్ష రూపాయలు ఇన్సూరెన్స్ పాలసీలు ఉండవని దీనివలన వ్యవసాయదారులకు చిన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని ప్రస్తుతం ఆ పాలసీని రెండు లక్షలకు పెంచారని దీని వలన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు భారంగా మారిందని అన్నారు. పాలసీదారుల ప్రీమియంపై జీఎస్టీని రద్దు చేసి పాలసీదాలకు బోనస్ రేటు పెంచాలన్నారు. ఏజెంట్లకు తగ్గించిన కమిషన్ పెంచి యధావిధిగా ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వం డిమాండ్ చేశారు. వెంటనే గవర్నమెంట్ వాటిని రద్దు చేయాలని ఆయన కోరారు.

88 కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - పిఠా పురం : అక్రమంగా గంజాయిని, తరలిస్తున్న వ్యక్తులని పిఠాపురం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుండి నర్సీపట్నం, రౌతులపూడి, పిఠాపురం మీదుగా కాకినాడ అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముద్దాయిలను అరెస్టు చేసినట్లు పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శ్రీనివాస్ మీడియా సమావేశంలో తెలిపారు. సోమవారం సాయంత్రం పిఠాపురం పోలీసులకు వచ్చిన సమాచారంతో కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో కాకినాడ డిఎస్పీ పర్యవేక్షణలో పిఠాపురం సిఐ జి శ్రీనివాస్, పిఠాపురం పట్టణ ఎసై వద్దాది మణికుమార్, వారి సిబ్బందితో రాపర్తి జంక్షన్ జాతీయరహదారి 216 వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా రాపర్తి వైపు గ్రామం నుండి పల్సర్ బైక్‌పై ఒక వ్యక్తి పైలెట్‌గా వ్యవహరిస్తూ వస్తుండగా వెనుక బజాజ్ పాసింజర్ ఆటోలో గంజాయి మూటలతో వస్తూ తనిఖీ చేస్తున్న తమ సిబ్బందిని చూసి కంగారుపడి పారిపోవడానికి ప్రయత్నించగా తమ సిబ్బంది మొగలి మణికంఠ రాజు (23), గబులంగి మునిరాజు (20), కొర్రా రాము (20), మామిడి సన్యాసిరాజు (23)లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి సుమారు 88 కేజీల గంజాయిని, పల్సర్ బైక్, పాసింజర్ ఆటోను స్వాధీనపరుచుకున్నట్లు సిఐ జి శ్రీనివాస్ తెలిపారు. వారిపై రిమాండ్ రిపోర్టుతో కోర్టులో హాజరుపరుస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్సై వద్దాది మణికుమార్, ఐడి పార్టీ సిబ్బంది, స్టేషన్ సిబ్బంది వున్నారు.

యువత రక్తదానాల్లో పాల్గొంటే గుర్తింపు కార్డులు

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : యువత రక్తదాన శిబిరాల్లో పాల్గొంటే అటువంటి వారిని గుర్తించి వారికి గుర్తింపు కార్డును అందిస్తారని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఏలూరులోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం సమీపంలో గల పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్పి కిషోర్ ప్రారంభించి రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని అటువంటివారిని పోలీస్ శాఖ ప్రోత్సహిస్తుందని పిలుపునిచ్చారు. యువత రక్తదానం చేస్తే వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామని, భవిష్యత్తులో వారికి ఏదైనా ఈ బ్లడ్ బ్యాంకుల ద్వారా సహాయం అందించడానికి ఆయా గుర్తింపు కార్డులు ఉపయోగపడతాయని చెప్పారు. కైకలూరు రూరల్ ఇన్స్పెక్టర్ వి.రవికుమార్ ఇప్పటికీ 18 సార్లు తన రక్తాన్ని దానం చేశారని, ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజ్ ఏలూరు ఇంజనీరింగ్ కాలేజ్ సిఆర్ ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ ఆదిత్య కాలేజ్, పోలీస్ సిబ్బంది ఆటో సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏలూరు డిఎస్పి డి.శ్రావణ్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు, బి.ఆదిప్రసాద్, ఏలూరు త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు, ఏలూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, ఆర్ఐ పవన్ కుమార్, రెడ్ క్రాస్ డాక్టర్లు ఆర్ఎస్ ఆర్కే, వరప్రసాద రావు, డాక్టర్ స్పందన, పిఆర్ఓ కేవి.రమణ, ఏలూరు గవర్నమెంట్ హాస్పటల్ నుంచి జి.సంధ్య, జి.జయలక్ష్మి రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.

30 మంది ఏఐటీయూసీలో చేరిక

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలోని 30 మంది కార్ డ్రైవర్లు ఏఐటియుసిలో చేరారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి కారం దారయ్య అధ్యక్షతన ఆల్ ఇన్ వన్ కారు డ్రైవర్స్ అసోసియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆ సంఘం జిల్లా కార్యదర్శి బుచ్చిబాబు 30 మంది కారు డ్రైవర్లను ఏఐటీయూసీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ సంఘానికి జిల్లా నాయకత్వం ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆల్ ఇన్‌వన్ కారు డ్రైవర్స్ అసోసియేషన్‌కు ప్రతినిధులను ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వేల్పుల సూరిబాబు, మహమ్మద్ హుస్సేన్ ఖాన్, కార్యదర్శిగా తొర్లకుంట హనుమంతరావు, సహాయ కార్యదర్శిగా మహమ్మద్ జాకీర్ ఖాన్, కోశాధికారిగా వంగపండు రాంబాబు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా నిమ్మగడ్డ వెంకటేష్, తెల్లం శ్రీను, 30 మంది కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మునీర్, మండల కార్యదర్శి రాము పాల్గొన్నారు.

అర్జీలు పరిష్కరించాలి : కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: ప్రజలు సమర్పించే వినతులకు నాణ్యమైన రీతిలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఆమె వినతులను స్వీకరించారు. ముందుగా గత వారం ప్రజలు సమర్పించిన వినతులపై అధికారులు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. నిర్ణీత కాలంలో ఫిర్యాదులను పరిష్కరించాలని, మళ్లీమళ్లీ రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పిడి డాక్టర్ కేసిహెచ్ అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

విశాలాంధ్ర- నూజివీడు: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. సోమవారం నూజివీడు మండలం అన్నవరం లో మహాత్మాగాంధీ ఉపాధిహామీ కింద రూ. 20 లక్షలు వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్ల పనులకు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలతోపాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పల్లెపండుగ కార్యక్రమాన్ని ఈనెల 20వ తేదీ నుంచి పెద్దఎత్తున నిర్వహించుకున్నామన్నారు. ఆ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. 120 కోట్ల విలువైన పనులకు శంఖుస్థాపన చేశామన్నారు. ఈ పనులన్నీ వచ్చే జనవరి నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేకమైన దృష్టిని కేంద్రీకరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నవరం గ్రామ పార్టీ అధ్యక్షులుఅలూరి పూర్ణచంద్రరావు,ఎంపీటీసీ దువ్వూరి వెంకయ్య,ఉప సర్పంచ్ చలసాని గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ వీరమాచినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా

విశాలాంధ్ర - కరప : కరప మండలం పెనుగుదురు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సునీత ఆత్మహత్య ప్రయత్నం కేసు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా పోలీసులు దళిత మహిళ పట్ల వివక్షత చూపుతున్నారని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాత సుబ్రమ్మణ్యం, మాల మహా నాడు రాష్ట్ర జేఏసీ అధ్యక్షులు పండు అశోక్ కుమార్, దళిత ప్రజా చైతన్యం రాష్ట్ర అధ్యక్షులు బుంగ సతీష్ కుమార్, ఐఎఫ్టియు కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శి గుబ్బల ఆదినారాయణ పేర్కొన్నారు. పది రోజులుగా కేసు నమోదు చేయకుండా పోలీసులు నిందితులకు అండగా నిలుస్తున్నారని, బాధితురాలు వద్ద తీసుకున్న వాంగ్మూలాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారని పోలీసులపై ఎస్పీ తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ధర్నా నిర్వహించారు.

సర్వాంగ సుందరంగా కొవ్వూరు మున్సిపాలిటీ

విశాలాంధ్ర - కొవ్వూరు : గోదావరి పుష్కరాల నాటికి కొవ్వూరు మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి అధి కారులు కౌన్సిల్ సంయుక్తంగా పనిచేయాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమా వేశం చైర్పర్సన్ భావన రత్న కుమారి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొ న్నారు. పుష్కరాల నాటికి అన్ని రోడ్లు సిసి రోడ్లుగా నిర్మించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పట్టణంలోని పలు సమస్యలను కౌన్సిల్ సభ్యులు సమావేశంలో చర్చించారు. కౌన్సిలర్లు సూరపనేని చిన్ని, కంటమణి రమేష్ తదితరులు చర్చల్లో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్ కౌన్సిలర్ అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు

ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : పేదలకు ఆపద్బాంధవుడులా ఆరోగ్యశ్రీ పథకాన్ని వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశ పెడితే అదే పథకాన్ని ముఖ్యమంత్రిగా జగన్ ఐదేళ్లు ఆరోగ్య శ్రీ పథకాన్ని నడి పిన ఘనత వైయస్ జగన్ ఓకే దక్కు తుందని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ ఆర్సిపి నాయకులు ముదునూరి మురళి కృష్ణంరాజు అన్నారు. ధర్మవరంలో ముదునూరి మురళీ రాజు పలు కుటుంబాలను పరామర్శించారు. ధర్మవరం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త పులగపూరి బుల్లబ్బాయి ఇటీవల కాలం లో రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు బాధిత కుటుంబాన్ని పరామ ర్శించారు. ప్రమాదంలో గాయపడిన బుల్లబ్బాయి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని 5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు, దొరబాబు, బోల్లు నాగేశ్వరరావు, మాగాపు శివ పాల్గొన్నారు.

ఆదిత్య యూనివర్సిటీలో విజ్ఞాన దాయకంగా ముగిసిన వర్క్ షాప్

విశాలాంధ్ర - గండేపల్లి : ఆదిత్య యూనివర్సిటీలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ డిపార్ట్మెంట్, ఆదిత్య లెర్నింగ్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన " బిల్డ్ స్మార్ట్ సోలుషన్స్ : ఇంటర్నెట్ అఫ్ థింగ్స్ అండ్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ విత్ జుర్రా 32 "వర్క్ షాప్‌కు రిసోర్స్ పర్సన్‌గా మిస్టర్ బాపూజీ కనపర్తి, ఫౌండర్ అప్టేటోన్ ఇన్నోవేషన్స్ వ్యవహరించారు. ఇంటర్నెట్ అఫ్ థింగ్స్ అండ్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ విత్ జుర్రా32 "అనే అంశం బిటెక్ రెండొవ సంవత్సరం స్టూడెంట్స్‌తో మాడ్లాడారు అని మరియు గత ఐదు రోజుల నుండి ఈ వర్క్ షాప్ జరుగుతుందని మరియు స్టూడెంట్స్ యాక్టీవ్గా పాల్గొన్నారు అని ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ ఎం వెంకటేష్ తెలిపారు. ఈ ప్రోగ్రాంలో ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్-అకాడెమిక్స్ డాక్టర్ ఎస్ రామశ్రీ, డీన్ స్కూల్ అఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ డోలా సంజయ్ మరియు ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ డిపార్ట్మెంట్ ఫాకల్టీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర - ఆలమూరు : ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్క రించేందుకే ప్రజా దర్బార్ నిర్వహి స్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఆల మూరు మండల పరిషత్ కార్యాల యంలో సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలపై 89 అర్జీలు అందజేశారు. రెవెన్యూ, రోడ్లు, డ్రైనేజీలు సమస్యలపై ఎక్కువ సంఖ్యలో ప్రజలు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార దిశగా ముందుకు సాగుతూ ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీలకు తగిన పరిష్కారం చూపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కెజె ప్రకాష్ బాబు, ఎంపీడీవో కే జాన్ లింకన్, ఈవోపీఆర్డి, ఇంచార్జ్ డిఎల్పిఓ ఐ రాజు, సీఐ విద్యాసాగర్, మండల పరిషత్ ఏవో ఎం మెహర్ ప్రకాష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పద్మావతి, హౌసింగ్ ఏఈ డి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారిని లక్ష్మీ లావణ్య, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే అనుచరుల మధ్య వివాదం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగరంలో దీపావళి బాణాసంచా దుకాణాల ఏర్పాటు విషయంలో కాకినాడ ఎంపీ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే అనుచరుల మధ్య వివాదం రేగింది. కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ తీరుకు వ్యతిరేకంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వర రావు (కొండబాబు) అనుచరులు రోడ్డుకు అడ్డంగా పడుకుని నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం కాకినాడ ఆర్టీవో కార్యాలయం ఎదురుగా ఈ నిరసనలను ఎమ్మెల్యే అనుచరులు చేపట్టారు. దీపావళి బాణాసంచా దుకాణాల ఏర్పాటు విషయంలో తమ వారికి రాకుండా ఎంపీ వారి అనుచరులు అడ్డుకున్నారని నినాదాలు చేశారు. అంతేకాకుండా కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వైసీపీ నేత, సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కనుసన్నులలో పనిచేస్తున్నారంటూ నినాదాలు చేశారు. కాకినాడ నుండి రాజమండ్రి వెళ్తున్న నాన్ స్టాప్ బస్సును కొంతసేపు టీడీపీ శ్రేణులు అడ్డగించడంతో ట్రాఫిక్కు పోలీసులు మళ్లింపు చర్యలు చేపట్టారు. ఈ సమస్యపై కాకినాడ ఆర్డిఓ ఎస్ మల్లిబాబును వివరణ కోరగా కాకినాడ పరిధిలో 128 దుకాణాలకు గాను 127 దుకాణాలకు కేటాయింపులు జరిగాయని వాటిలో ఒక్కదానికి మాత్రమే నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో అనుమతులు ఆపమన్నారు. ఆ దుకాణం కాకినాడ మెయిన్ రోడ్లో ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య, ఇరువైపులా దుకాణాలు ఉండటంతో అనుమతిని ఆపామన్నారు. కాకినాడ ఎంపీపై ఎమ్మెల్యే అనుచరులు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టడం నగరంలో చర్చనీయాంసంగా మారింది.

విద్యుత్ చార్జీలపై కూటమి ఉమ్మడి బాదుడు తగదు...!

పౌర సంక్షేమ సంఘం

విశాలాంధ్ర - కాకినాడ : వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెం చారని పెద్ద ఎత్తున ఉద్యమబాట పట్టించిన తెదేపా, జనసేన, బిజెపి ఉమ్మడి ఎన్డిఎ కూటమి అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా 4 నెలల కాలంలోనే యూనిట్‌కు రూ. 1.21 పైసల వంతున విద్యుత్ చార్జీలు పెంచే చర్యలు వహించడం గత రెండేళ్ల కిందట జరిగిన వాడకానికి ఏర్పడిన అధికరేట్లు చూపిస్తూ పెనం మీద నుండి పొయ్యిలోకి పడదోసినట్టుగా విద్యుత్ వినియోగదా రులను అవస్థలకు గురి చేయడం తగదన్నారు. కరెంట్ చార్జీలు పెరగకుండా వుండాలంటే జగన్ బాదుడే బాదుడు లేకుండా వుండాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలను ప్రలోభపెట్టిన కూటమి ప్రభుత్వం ఉమ్మడి బాదుడు చేపట్టడం బరితెగింపు తంతుగా వుందన్నారు. పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ కరెంట్ చార్జీలు అధికం కావడం వలన అన్ని ధరలు విపరీతంగా పెరిగి నిత్యావసర వస్తువులు సామాన్య మధ్య తరగతికి అందడం లేదన్నారు. కూటమిపెంచుతున్న విద్యుత్ భారం వలన మరింత ధరలు పెరిగే ముప్పు వుందన్నారు. ధరలు భరించలేని ప్రజలు సహాయ నిరాకరణ చేయడం తప్పదన్నారు. సామాన్య గృహాల నుండి మధ్య తరగతి గృహాల వరకు వంద నుండి అయిదువందల రూపాయల భారంపడుతుందన్నారు. వేసవిలో ఈభారం మూడింతలు పెరిగేఅవకాశం ఉంటుందన్నారు. చమురు, వంట గ్యాస్, కరెంటు సరఫరా ధరలు నియంత్రణ చేయాల్సిన ప్రభుత్వం వాటిమీద పులి మీద పుట్రలా స్వారీ చేయడం వలన గతంలో ఏ ప్రభుత్వం ఎదుర్కోనంతగా ప్రజల నుండి తీవ్ర ప్రజావ్యతి రేకత మూటకట్టుకోవ డం ఖాయమన్నారు. ఏపీ విద్యుత్ వినియోగ దారుల నుండి కరెంట్ ఛార్జీల రూపంలో రూ. 6, 072. 86 కోట్ల మేర వసూలు చేసేందుకు డిస్కంలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం మంచిది కాదన్నారు.

హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - పెరవలి : మండలం లోని అన్నవరప్పాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో దేవదయ ధర్మదాయ శాఖ ఉన్నతా ధికారుల ఆదేశముల మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు జి సత్య వరప్రసాద్ పర్యవేక్షణలో సోమవారం హుండీలు లెక్కింపు జరుపగా 32రోజులకు రూ. 2,58. 590లు ఆదాయం సమకూరి నట్లు ఆలయ కార్య నిర్వ హణ అధికారి యం రాదా కృష్ణ తెలిపారు. ఈకార్య క్రమంలో గ్రామస్తులు, భక్తులు, సేవకులు పాల్గొన్నారు.

బాణాసంచా దుకాణాల పరిశీలన

విశాలాంధ్ర - జగ్గంపేట : దీపావళిని పురస్క రించుకుని బాణా సంచా దుకాణా లను ఏర్పాటు చేస్తున్న స్థలాన్ని జగ్గంపేట తహశీల్దార్ రమేశ్ పరిశీలించారు. నిబంధన లకు అనుగుణంగా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని షాపుల యజమానులకు ఆయన సూచిం చారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దార్ నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

హత్య కేసులో నిందుతుడికి యావజ్జీవ కారగార శిక్ష

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలో చింతలూరు గ్రామంలో 2014 డిసెంబర్ 29వ తేదీన భార్యా భర్తల మధ్య ఉన్న గొడవలు నేపథ్యంలో కూనిశెట్టి అప్పారావు అనే దొరబాబు తన భార్య సుజాతను మెడకు చున్ని బిగించి హత్య చేశాడు. అప్పట్లో ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేయగా అప్పటి సిఐ జి సత్యనారాయణ కేసు దర్యాప్తు చేసి ముద్దాయిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో వాదో పవాదనలు విన్న పెద్దాపురం ఏడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి చంద్రమౌళి సోమవారం ముద్దా యికి జీవిత ఖైదు తీర్పునిచ్చారు. 2014లో జరిగిన హత్య కేసులో ముద్దాయికి యావ జ్జీవ కారాగార శిక్ష అదనంగా మరో మూడు సంవత్సరాలు జైలు శిక్ష వెయ్యి రూపాయల జరిమానా, వెయ్యి రూపాయలు చెల్లించలేని పక్షంలో మూడు నెలలు జైలు శిక్ష విధించినట్లు ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ సూరి అప్పారావు తెలిపారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ మృత్యుంజయరావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

రీ సర్వే సదస్సుల్లో 47 దరఖాస్తులు

విశాలాంధ్ర - కరప : కరప మండలం వేలింగి గ్రామంలో నిర్వహించిన రీ సర్వే సదస్సుల్లో రైతుల వద్ద నుండి 47 దరఖాస్తులు అందాయని తహశీల్దార్ ఎన్ సత్య నారాయణ పేర్కొన్నారు. ప్రభుత్వం రీ సర్వేలతో రైతులను ఆదుకునేందుకు సదస్సులు నిర్వహిస్తుందని ఆయన తెలి పారు. ఈకార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వోలు, చుంద్రు వెంకన్న రావు, జనసేన టిడిపి నాయకులు పాల్గొన్నారు.